నవతెలంగాణ

1 హన్మకొండ,వరంగల్, జయశంకర్, ములుగు, జనగామ, మహబూబాబాద్

గురువారం 20 ఏప్రిల్ 2023

లారీ ఢీకొని ఫార్మసీ విద్యార్థి మృతి

నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండల కేంద్రం లోని గ్రానైట్ ఫ్యాక్టరీ ల సమీపంలోని వే బ్రిడ్జ్ వద్ద బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. వల్భాపూర్ లోని ఎస్సారార్ ఫార్మసీ కళాశాల విద్యార్థి హుజూరాబాద్ మండలం మాణిక్యపూర్ విలేజ్‌కు చెందిన మంద



ప్రణయ్(20) అక్కడికక్కడే చనిపోయాడు. స్నేహితుడితో కలిసి బైక్ పై హనుమకొండకు వెళ్లి ఎగ్జామ్ రాసి తిరిగి వస్తూ ఎల్కతుర్తి వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా బస్సు రావడంతో లారీ టైర్ల కింద పడిపోయి మత్యువాత పడ్డాడు. బైక్ పై వెనకాల కూర్చున్న మరో విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. ఘటనపై వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.



పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టిఎల్ రవి

నవతెలంగాణ-గోవిందరావుపేట

కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టిఎల్ రవి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పస్రా గ్రామంలో వెంకటేష్ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రవి హాజరై మాట్లాడారు. రెండున్నర సంవత్సరాల నుండి ఇంతవరకు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. విద్యార్థులను ఉన్నతచదువులకు దూరం చేస్తున్నదన్నారు. చాలామంది విద్యార్థులు పీజీలు, డిగ్రీలు పూర్తిచేసి ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని అన్నారు. ప్రైవేట్ కళాశాలలు యాజమాన్యం స్కాలర్‌షిప్ రాలేదనే సాకుతో వారికి సర్టిఫికెట్లు ఇవ్వట్లేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు తీసుకోకుండా వారికి నచ్చిన రీతిలో లక్షల రూపాయల ఫీజులు తీసుకుంటున్నారన్నారు. గురుకులంలోను ప్రైవేట్ కాలేజీల్లో యాజమాన్యం సమ్మర్ క్యాంపు పేరిట విద్యార్థులకు తరగతులు నిర్వహించడాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. సమ్మర్ క్యాంపులు కొనసాగితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గూగులోత్ రమేష్, అఖిల్, కళ్యాణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక క్వారీ, కౌలు డబ్బులు ఇవ్వట్లేదు

- రోడ్డెక్కిన రైతులు

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలం లోని మద్దులపల్లి గ్రామ శివారు కుంట్లం 2వ ఇసుక క్వారీకి మద్దులపల్లి రైతులు భూములు లీజుకు ఇచ్చారు. 2022, 2023 సంవత్సరానికి గాను కౌలు డబ్బులు రైతులకు ఇవ్వకపోవడంతో టీఎస్ఎండీ, కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. వారం రోజులకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పినప్పటికీ నేటి వరకు డబ్బులు ఇవ్వలేదు. దీంతో బుధవారం మద్దులపల్లి రైతులు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. రైతులు ఇసుక క్వారీ లోకి లారీలు వెళ్లకుండా నిలిపి ఆందోళన చేపట్టారు. ఎక్కడికక్కడ లారీలు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. కాళేశ్వరం ఎస్సై లక్ష్మణరావు ఘటనాస్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను పై అధికారుల దష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. తమకు న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేష్, పర్వతాలు సమ్మయ్య, గట్టయ్యతో పాటు 20మంది రైతులు పాల్గొన్నారు.



తక్షణ సాయం, ఎక్స్‌గ్రేషియా అందించాలి

- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్

నవతెలంగాణ - ములుగు

తాడ్వాయి మండలం నార్లపూర్ జీపీ పరిధి ఎల్బాక గ్రామానికి చెందిన మొక్క రాజు గౌడ్ ఈనెల 15న తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడగా ఎడమ కాలు, చేయి విరిగిందని, బాధితునికి కార్పొరేషన్ నుంచి తక్షణ సహాయం, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేబోయిన రవి గౌడ్ డిమాండ్ చేశారు. ములుగు బాలాజి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మొక్క రాజు గౌడ్‌ను బుధవారం సంఘం జిల్లా ప్రతినిధి బందం పరామర్శించింది. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ఇటీవల గీత కార్మికులు తాటి చెట్ల నుండి పిట్టల్లా రాలి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఇచ్చే ఎక్స్ గ్రేషియా విషయంలో నిబంధనలు పక్కన పెట్టి తక్షణమే ఎక్స్ గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఉన్నా మూడు సంవత్సరాలనుండి ఎక్స్ గ్రేషియా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఏజెన్సీ నాన్ ఏజెన్సీ అని చూడకుండా తాటి చెట్ల పై నుండి పడిన గీత కార్మికులందరికి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయక పోవడం సమంజసం కాదని అన్నారు. ప్రమాదాలు జరుగకుండా సేఫ్టీ మోకులు గీత కార్మికులకు ఇవ్వాలని అన్నారు. టాడి కార్పొరేషన్ సహాయాన్ని తక్షణమే పెంచాలని అన్నారు. గీత కార్మికుల సమస్య ల పరిష్కారం కోసం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు, ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొక్క దుర్గయ్య గౌడ్, మొక్క సమ్మయ్య గౌడ్, శ్రీహరి గౌడ్, సుశీల, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన గట్టు రఘు(30) పెద్దాపూర్ నుండి తన మోటార్ సైకిల్ పై భూపాలపల్లికి వచ్చి తిరిగి పెద్దాపూర్‌కు వెళ్తున్నాడు. మంజూరునగర్ 8 ఇంక్లైన్ క్రాస్ రోడ్ వద్ద వెనుక నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో గట్టు రఘు మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో గట్టు రఘు కింద పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మతి చెందాడు. మతుని భార్య గట్టు స్నేహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా మతుడు గీత కార్మికుడు, వ్యవసాయ కూలీ. మతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అభివద్ధి నిరోధకుల ఆగడాలను ఎండగట్టాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

అభివద్ధి నిరోధకులు, బీజేపీ ఆగడాలను ఎండగట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం తొర్రూర్ లోని రామ ఉపేందర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్న కేంద్రం వల్ల రాష్ట్రంలో అభివద్ధి కుంటు పడుతున్నదని అన్నారు. రావాల్సిన నిధులను నిలిపి వేశారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నారని, కూలీల పొట్టలు కొట్టి, పెద్దోళ్ల కడుపులు నింపుతున్నారని అన్నారు. అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణను అవార్డులిచ్చి అభినందించి నిధులను తగ్గించి నీరుగారుస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేలా ప్రజలను సమాయత్తం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఇంటిటికీ తీసుకెళ్లే బాధ్యత పార్టీ



కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీ నిధులకు కోత పెట్టి నింది స్తున్నదని అన్నారు. న్యాయంగా తెలంగాణకు రావాల్సిన నిధులను కూడా నిలిపివేస్తున్నదన్నారు. అయినా, సీఎం కెసిఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. రాష్ట్రంలోని గ్రామాలకు 13 అవార్డులు రాగా, తీసుకోవడానికి ఢిల్లీకి వెళ్ళినప్పుడు వేదిక మీదే కేంద్రాన్ని నిలదీశానని అన్నారు. తాను పాలకుర్తి నియోజకవర్గంలో పాత కొత్త తేడా లేకుండా కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ నేతత్వంలోనే తెలంగాణ అభివద్ధి చెందుతోందని అన్నారు. సమైక్య పాలనలో నిరాదరణకు గురైన పల్లెలు నేడు అభివద్ధిలో పరుగులు పెడుతున్నాయన్నారు. అభివద్ధి, సంక్షేమాలలో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని ప్రశంసించారు. రాష్ట్రానికి నయా పైసా ఇవ్వని బీజేపోళ్లు కూడా తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను సీఎం తిప్పికొట్టారన్నారు. మాయ మాటలతో తెలంగాణను ఆగం పట్టియ్యాలని చూస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కషి చేస్తున్న సీఎం కేసీఆర్ కు అండగా నిలావాలని పిలుపునిచ్చారు. ఎర్రబెల్లి ట్రస్టు ఛైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావు మాట్లాడుతూ దయాకర్‌రావు తాను నిరంతరం నియోకవర్గ అభివద్ధి, ప్రజల బాగోగుల గురించే ఆలోచిస్తామన్నారు. బీఆర్ఎస్ సిఎం కెసిఆర్‌ని, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, లింగాల వెంకటనారాయణ గౌడ్,సర్పంచులు పోసాని పుష్పలీల, గుంటుక యాదలక్ష్మి, లకావత్ శోభన యాకూబ్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-రేగొండ

అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కషి చేస్తున్నారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని తిరుమలగిరి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కట్ల రాణి మధుసూదన్ రెడ్డి రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడారు. మానవ అవయవాల్లో అన్నింటికంటే కళ్ళు ముఖ్యం అన్నారు. కానీ నేడు ప్రజలు కళ్ళను నిర్లక్ష్యం చేస్తున్నారని



అన్నారు. కంటి వెలుగు శిబిరాల ద్వారా కంటి పరీక్షలు చేయించుకుంటే తక్షణమే అద్దాలు అందిస్తున్నారని,

అలాగే కొంతమందికి పరీక్షలు నిమిత్తం ఉచితంగా కార్పొరేటు ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తూ వారికి ఉచితంగా అద్దాలను మందులను పంపిణీ చేస్తున్నారని అన్నారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంట గోపాల్, వైద్యాధికారి హిమబిందు,పీఏసీఎస్ డైరెక్టర్ చల్లగురుల సుదర్శన్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అంకం రాజేందర్, వైద్య సిబ్బంది, ఆశాలు బీఆర్ఎస్ కార్యకర్తలు కడారి జనార్దన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- నర్సంపేటలో సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-నర్సంపేట

పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని రూ.80 లక్షల టీయుఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న వరంగల్ రోడ్డు కూడలి, అంబేద్కర్ కూడలి, పాకాల రోడ్డు కూడలిలో చేపట్టనున్న జంక్షన్ నిర్మాణ ప్రదేశాలను పరిశీలించారు. రూ.2 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేడ్ వెజ్ మార్కెట్, రూ.5 కోట్లతో నిర్మాణ దిశలో ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్, కమేలా నిర్మాణ పనుల సందర్శించారు. అక్కడి నుంచి పాకాల ఆడిటోరియం వద్దకు చేరుకొని నిర్మాణ తుది పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో మౌళిక సౌకర్యాలను మెరుగు పర్చడానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 కోట్ల నిధులతో చేపడుతున్న వివిధ



పనులను పరిశీలించామన్నారు. నిర్ణీత గడువులోగా పనులను వేగవంతంగా చేపట్టేందుకు సంబంధిత ఇంజనీరులను, కాంట్రాక్టర్‌లను ఆదేశించామని తెలిపారు. వివిధ కూడలిల సుందరీకరణ పనులను వెంటనే చేపట్టాలని ఇందుకోసం టౌన్ ప్లానింగ్ డిజైనింగ్‌కు అనుగుణంగా ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులను ప్రారంభించేలా కాంట్రాక్టర్‌లను పురమాంచాలన్నారు. పట్టణాభివృద్ధికై సమీక్ష నిర్వహించి తగు చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడి మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీకిషన్, కమిషనర్ నాయిని వెంకటస్వామి, టౌన్ ప్లానింగ్,



ఇంజనీరు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు, కంటి వెలుగును పరిశీలన

మండలంలోని మహేశ్వరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య సందర్శించారు. కూలీలలో మాట్లాడి సమస్యలను అడిగి తెల్సుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమం తీరుతెన్నులను పరిశీలించారు. వృద్ధులు, మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకాడి డీఆర్‌డీవో సంపత్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో సునిల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు పీకేసిన ఫారెస్టు పోలీసులు

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని కుదురుపల్లి గ్రామంలో గత 20, 30 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదల గుడిసెలను బుధవారం తెల్లవారుజామున ఫారెస్ట్ అధికారులు పోలీసులు దౌర్జన్యంగా పీకేసారు. గోదావరి పక్కన ఉన్న కుదురుపల్లి గ్రామం ప్రతి సంవత్సరం గోదావరి ముంపునకు గుడిసెలు మునిగిపోవడంతో తమ తాతలు ముత్తాతల నుండి రెవెన్యూ సర్వేనెంబర్ 108లో 98 ఎకరాల్లో సుమారు 200 గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని బాధితులు తెలిపారు. ఈ భూమి ఫారెస్ట్‌కు సంబంధించిందని



దౌర్జన్యంగా ఫారెస్ట్ అధికారులు గుడిసెలు పీకేసారని వాపోయారు. ఈ సంవత్సరం కూడా ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షానికి ఊరంతా మునిగిపోయిందని తెలిపారు. దీంతో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కమల ఫారెస్ట్ అధికారులు ఎస్ఐలు రాజకుమార్ భవాని సేన ఆధ్వర్యంలో గుడిసెలు పీకేసారని, తాము అడ్డుకోవడంతో అక్కడ నుండి వెళ్లిపోయినట్టు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో భూమిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి రెండు గుంటల భూమి ఇవ్వాలని కోరారు. లేదంటే పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం స్టాఫ్ నర్స్ పోస్టుల రిక్రూట్మెంట్‌లో జరిగిన అవకతవకలపై కలెక్టర్ వెంటనే విచారణ జరిపి ఆ పోస్టుల రిక్రూట్మెంట్‌ను నిలిపివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఎలాంటి ఇంటిమేషన్



లేకుండా మెరిట్ లిస్టును నోటీసు బోర్డులో పెట్టకుండా ఏ ప్రాతిపదికన వాళ్ళని తీసుకుంటున్నారని ప్రశ్నించారు. కొంతమందికే ఫోన్ ద్వారా చెప్పి ఈ రిక్రూట్మెంట్ జరపడం సరైనది కాదని ఈ విషయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అత్యుత్సాహం చూపెడుతున్నారని, కొన్ని సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్‌లను ఎన్‌హెచ్ఎం కింద రిక్రూట్మెంట్ చేయాలని, ఈ విషయంపై కలెక్టర్ విచారణ జరపాలని కోరారు. ఈ ధర్నాలో బాధితులు సరిత, అరుణ, స్వప్న, వనిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి నియోజకవర్గంలో పేద ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు బుధవారం జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్ తో కలిసి కీర్తి రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై వ్యతిరేకత మొదలైందని దీనికి నిదర్శనమే భూపాలపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అధికార పార్టీ



కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం అన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరులైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయడం వారి పనితీరుకు నిదర్శనం అన్నారు. గత రెండు రోజుల క్రితం పేదలకు పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అక్రమాలు జరిగాయని, వారికి నచ్చిన వారికి ఇండ్లు పంపిణీ చేశారని ఆరోపించారు. అదేవిధంగా పట్టణంలో కొనసాగుతున్న అభివద్ధి పనులలో అక్రమాలు జరిగాయని చివరకు బ్లీచింగ్ పౌడర్ మున్సిపల్ సిబ్బంది జీతాలలో కూడా కక్కుర్తి పడుతున్నారన్నారు. పట్టణమే కాకుండా భూపాల పల్లి నియోజక వర్గం మొత్తం అవినీతి పాలన నడుస్తుందని ఆమె ఆరోపించారు. పేదల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్ రెడ్డి, అర్బన్ ఉపాధ్యక్షుడు కోరే సుధాకర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి కుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి మండల రఘునాథ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్

నవతెలంగాణ-పాలకుర్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుచున్న ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ఏఈఓలను సూచించారు. బుధవారం మండల కేంద్రంలో గల రైతు వేదికను సందర్శించి రైతు బీమా, పీఎం కిసాన్, రైతుబంధు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకుర్తి డివిజన్ వ్యవసాయ ఉపాసంచాలకులు అజ్మీర పరశురాం నాయక్ తో కలిసి ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేటప్పుడు నాణ్యతతో కూడిన తాలులేని ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని రైతులను చైతన్య పరచాలని సూచించారు. మద్దతు ధర పొందేందుకు నాణ్యత నప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు. రైతుల వివరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని అన్నారు. వేసవి ఎండలు మండుచుండడంతో కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా దష్టి పెట్టాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వారి సమస్యల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఏఈఓ జాటోత్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి

నవతెలంగాణ- తాడ్వాయి


వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున అందరూ జాగ్రత్తలు పాటించాలని ములుగు జెడ్పి వైస్ చైర్మన్ నాగజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్యుల పని విధానంను పరిశీలించారు. రోగులకు పీహెచ్‌సీ వైద్యాధికారి రంజిత్ అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. ఎండాకాలం ప్రారంభం నుండే ఎండ ప్రతాపం రోజురోజుకీ పెరుగుతుందని, అవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని సూచించారు. అత్యవసరమైన పని ఉంటే ఉదయం 8 గంటల లోపే బయటికి వెళ్లి ఇంటికి చేరుకోవాలని తెలిపారు. పిల్లలు వద్దులు ఎండవేడిని తట్టుకోలేక పోతారని, వారు జాగ్రత్త వహించాలని కోరారు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పకుండా తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరు గౌరమ్మ, కో ఆప్షన్ మెంబర్ దిలావర్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు దిడ్డి మోహన్ రావు, ముంద్రాతి రాజశ్రీ, సయ్యద్ హుస్సేన్(వహీద్) జాగతి మహిళా అధ్యక్షురాలు పుప్రి స్వరూప, రాజు, అనిల్, వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీఠ

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని ములుగు జడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని కాటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సర్పంచ్ గౌరమ్మ అధ్యక్షతన ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి అన్ని పండుగలను గొప్పగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ ఘనత కేవలం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కాటాపూర్ సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు లీలావర్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు దిడ్డి మోహన్‌రావు, రాజశ్రీ, జాగతి మహిళా అధ్యక్షురాలు పుప్రి స్వరూప, వహీదోస్సేన్, యాలం విక్రమ్, మద్దెల తిరుపతి, కె సురేష్, అనిల్, వెంకటేష్, పి రాజు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక







ఆదర్శలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నవతెలంగాణ - కాటారం

మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న సందర్భంగా యూకేజీ విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్, బహుమతులను ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ కార్తీక్ రావు అందజేశారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు సజనాత్మకతతో రూపొందించి ప్రదర్శించిన పలు చార్టులు, వివిధ ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి.. అనంతరం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గొత్తికోయ గ్రామంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి తోగ్గూడెం గొత్తికోయ గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కారం నిఖిల్ మాట్లాడుతూ... గూడెంలోని గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలకు, జ్వర పీడితులకు, జలుబు, దగ్గు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, హెల్త్ అసిస్టెంట్ పొదెం రవి, ఏఎన్ఎం సీతారామమ్మ ఆశలు రాణి, సులోచన, లక్ష్మీబాయి, నాగమణి, పూలమ్మలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీ డే

నవతెలంగాణ- తాడ్వాయి

మండలంలోని కాటాపూర్‌లో కాటాపూర్-2, కాటాపూర్-6 కాటాపూర్- ఎంఎం సెంటర్లలో బుధవారం ఈసిసి డే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మూడు, ఆరు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలను అంగన్వాడి స్కూల్‌లకు పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద మాట్లాడుతూ పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్వాడి స్కూల్‌కు పంపించే విధంగా, అంగన్వాడీ కేంద్రాల్లో జరిగే కార్యక్రమాలు గురించి, ప్రీ స్కూల్ గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడి టీచర్లు సమ్మక్క, సరిత, నిర్మల, అంగన్వాడి కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నిరు పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

నవతెలంగాణ -మహాముత్తారం

సీఎం సహాయనిధి నిరు పేదలకు వరమనివ వాజీ జెడ్పిటిసి మందల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కనుకునూరు గ్రామపంచాయతీకి చెందిన చీకట్ల మానస తండ్రి రాజేందర్‌కు పెద్దపల్లి జడ్పీ చైర్మెన్ పుట్ట మదన్న చొరవతో మంజూరైన రూ.25000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఎంపీటీసీ శ్రీపతి సురేష్, కనుకునూరు సర్పంచ్ కుడుముల లక్ష్మి, మండల యూత్ అధ్యక్షులు జాటోత్ ,జైపాల్ నాయక్,బీసీ సెల్ మండల అధ్యక్షులు చీకట్ల లింగయ్య గౌడ్, పెగడపల్లి సర్పంచ్ కోర్ర వినోద జగపతినాయక్, కనుకునూరు గ్రామశాఖ అధ్యక్షులు రేగ రమేష్, పెగడపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు రామగిరి దుర్గయ్య, హున్న నాయక్ పాల్గొన్నారు.



పాఠశాలకు పూర్వ విద్యార్థి ఆర్థికసాయం

నవతెలంగాణ-చిట్యాల

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కేంద్రానికి చెందిన 2001-2002 పదో తరగతి బ్యాచ్ కి చెందిన తౌటం నాగరాజు తన సొంత ఖర్చులతో పాఠశాలకు రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. తౌటమ్ నాగరాజు వత్తి రీత్యా లండన్‌లో వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల చదువుకున్న పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుని రూ. 70 వేలు విలువ చేసే విద్యార్థులకు 150 టిషర్ట్స్ , తాగునీరు పరిష్కారం కోసం వాటర్ ప్లాంట్ మరమ్మతు, చైర్స్, వాటర్ క్యాన్ సెట్లు, క్రీడా సామగ్రిని స్కూల్‌కి ఆయన తండ్రి తౌటం అంతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు కు ఉపాధ్యాయ బందం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపీటీసీ కట్కూరిపద్మ నరేందర్ కతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగరాజు తండ్రి అంతులును సన్మానించారు. ఈ కార్య క్రమంలో హెచ్ఎం రఘుపతి, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ- కాటారం

కాటారం మండల కేంద్రంలోని మసీదు వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాటారం పిఎసిఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు 160 మందికి తన సొంత ఖర్చులతో చీరలు , సేమియా, చక్కెర, ఖర్జూరా ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ముస్లిం కుటుంబాల అందరికీ నా వ్యక్తిగతంగా చిరుకానుకగా అందిస్తున్నానని అన్నారు. అల్లా దీవెనలతో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్ల సుజాత, దెబ్బేట రాజేష్, దోలి ఆర్జయ్య, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై మండల సభలో ఆగ్రహం

- సమస్యలపై నిలదీసిన సర్పంచులు

నవతెలంగాణ-గణపురం

గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ రచన నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కావటి రజిత రవీందర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మిషన్ భగీరథపై చర్చ జరిగింది. సర్పంచ్ లందరూ మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవికాలంలో గ్రామాల్లో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఫోన్లు చేసిన అధికారులు ఎత్తకపోవడంతో తాము ఎవరిని అడగాలని సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేష్, సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి. నగరంపల్లి సర్పంచ్ వంగ కుమారస్వామి, బసవరాజు పల్లి సర్పంచ్ చెరుకు కుమారస్వామిలు నిలదీశారు. పదవి కాలం పూర్తి అయ్యేవరకు కూడా ప్రజలకు సరైన సమయంలో



మంచినీరు అందించే పరిస్థితి లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బందులు పడాల్సి వస్తుంది అన్నారు. తమకు రావాల్సిన బిల్లులు కూడా రావడం లేదని నిలదీశారు. అనంతరం నవతెలంగాణ పత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన సర్పంచులు గణపురం వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్లు ఎందుకు ఉండడం లేదని నిలదీశారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవార్డు తీసుకున్న ఆసుపత్రి అని కేంద్ర ప్రభుత్వం నుండి బోలెడు నిధులు వస్తున్నప్పటికీ డాక్టర్ల అశ్రద్ధ వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఎలక్ట్రిసిటీ ఏఈ వెంకటరమణ పై బసవరాజు పల్లి సర్పంచ్ చెరుకు కుమారస్వామి తాము డీడీలు కట్టిన ఇప్పటి వరకు ట్రాన్స్ఫార్మర్లు ఎందుకు రావడం లేదన్నారు. 58, 59 జీవో ప్రకారంగా గాంధీ నగర్ గ్రామంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు తమ ఇండ్లను రెగ్యులరేషన్ చేయలేదని సర్పంచ్ మాదం మమత సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి గండ్ర పద్మ సత్యనారాయణరావు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివద్ధికి పాటుపడాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, తహసిల్దార్ సతీష్ కుమార్, సిడిపిఓ అవంతి, సర్పంచులు నారగాని దేవేందర్ గౌడ్, ఐలోని శశిరేఖ రామచంద్ర రెడ్డి, ఆగం రావు, ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్‌గౌడ్, చెన్నూరి రమాదేవి మధుకర్ మంద అశోక్‌రెడ్డి, సుధర్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి, ఏపిఎం ధర్మేంద్ర, ఇన్చార్జి ఎపిఓ రాజు, ఎంఈఓ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత జ్యోతి

నవతెలంగాణ - ములుగు

రైతులు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలితా శివజ్యోతి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల సూచన మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను (రైతు వేదిక) కొత్తూరు గ్రామం క్లస్టర్ (రాయినిగూడెం)లో లలితా శివజ్యోతి ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్థాయిలోనే రైతుల కోసం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. ఉచిత న్యాయ



సహాయం పొందవచ్చునని అన్నారు. రైతులు ఈ అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఉపయోగించుకొని వారికి చట్ట పరమైన ఏ రకమైన సమస్య ఉన్న పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ కోసం పారా లీగల్ వాలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యను దరఖాస్తు రూపంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టి మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి కెపె గౌస్ హైదర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ శ్రీపాల్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎం సంతోష్,ములుగు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేకల మహేందర్ ,బలుగు చంద్రయ్య, ఎమ్ అశోక్ న్యాయవాది, ములుగు మండలం ఏఈఓ లు, రాయిని గూడెం పంచాయతీ కార్యదర్శి ,సుమారు 100 మంది రైతులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకుడిపై విమర్శలు తగవు : కాంగ్రెస్

నవతెలంగాణ- కాటారం



పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ను మంథని నియోజకవర్గ ప్రజలు ఛీ కొడుతున్నారని, ప్రతిపక్ష నాయకుడిపై విమర్శలు తగవనికాంగ్రెస్ పార్టీ కాటారం మండల నాయకులు అన్నారు. మండలంలోని దామరకుంట గ్రామంలో బుధవారం వారు సమావేశమై మాట్లా డారు. దామరకుంట గ్రామంలో డబుల్ బెడ్ ఇండ్లు 2016లో ప్రారంభమయ్యాయని ఇప్పటి కీ పూర్తి కాకపోవడం పుట్ట మధు వైఫల్యమేనని అన్నారు. నాలుగు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి మూడు సంవత్సరాలు జడ్పీ చైర్మన్ గా ఉండి ప్రభుత్వం అధికారంలో ఉండి నిధులు విడుదల చేయాల్సింది పోయి ప్రతిపక్ష నాయకుని పై విమర్శించడం అవివేకతనానికి నిదర్శ నమని అన్నారు. శ్రీధర్ బాబు, శ్రీపాదరావు పేదలకు భూములు పంచిపెట్టి, ఉన్నత ఉద్యో గాలు వదిలిపెట్టి ప్రజా క్షేత్రంలో అఖండ విజయాలు సాధించారని అన్నారు. దామరకుంట లో అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారంలో ఉండి కూడా రైతులకు న్యాయం చేయలేదని అన్నారు. వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన వారికి నష్టపరిహారం కూడా ఇప్పించలేదని అన్నారు. అన్నారం బ్యారేజ్ తో అక్రమ ఇసుక దందాలతో కోట్ల రూపాయల కమిషన్లు దండుకొని ఈ ప్రాంత ప్రజల గహాలు, పంట పొలాలను నీటి ముంచిన చరిత్ర నీదని విమర్శించారు. ప్రతిపక్ష నేత అడ్డుకుంటున్నారని అనడంపై ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. జెడ్పీ సమావేశాలకు శ్రీధర్ బాబు రావడం లేదు అంటున్న మీరు, మండల ప్రజా పరిషత్ సమావేశాలకు భూపాలపల్లి జడ్పీ చైర్మన్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలలో దామరకుంట లిఫ్ట్ ఇరిగేషన్, పంట నష్టపరి హారం, అన్నారం ముంపు బాధితులు, చిన్న కాలేశ్వరం ప్రాజెక్టుల అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసిన విషయం తెలవదా అన్నారు. దామరకుంట గ్రామ అభివద్ధి పై ప్రజాక్షేత్రంలో చర్చ ఏర్పాటు చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మంథని ప్రజలు ఓడించడం ఖాయ మని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మ య్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆంగోత్ సుగుణ, డిసిసి ప్రధాన కార్యదర్శి స్వప్న రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు చీమల సందీప్, మహిళ మండల అధ్యక్షులు జాడి మహేశ్వరి రమేష్, సర్పంచులు టి, దేవేందర్ రెడ్డి రఘురాం నాయక్, ఆకుల చంద్రశేఖర్, సిహెచ్ తిరుపతి, ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి శివ సాయి కష్ణ, ఉప సర్పంచ్ సందీప్ పాల్గొన్నారు.

కాటారం ప్రాంత ప్రజలకు నీరందించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ -కాటారం



గోదావరి పరివాహక ప్రాంతాలలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కనీసం ఎకరానికి కూడా నీళ్ల ఇవ్వని దుస్థితి ఏర్పడిందని గిరిజన ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ చందా లింగయ్య దొర అన్నారు. బుధవారం మండలంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా దక్షిణ తెలంగాణ ఇతర ప్రాంతాలకు ఇక్కడి నీళ్లను తరలించడం జరుగుతుందని తెలిపారు. మంథని నియోజకవర్గంలో ఉన్నటువంటి బీడు భూములకు సాగునీరు అందించాలని సంకల్పం ఈ ప్రాంత రాజకీయ నాయకుల లేకపోవడం దూరదష్టకరమన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో పనిచేస్తున్న ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత లకు సాగునీరు అందించే వరకు ఈ పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, మహాదేవపూర్ మాజీ ఎంపీపీ గురుసింగ బాపు, దుర్గం శంకర్, దయ్యం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ములుగు సీటే.. టార్గెట్‌గా పనిచేయాలి : లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-మంగపేట



బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ములుగు ఎమ్మెల్యే సీటే... టార్గెట్‌గా కార్యకర్తలు పని చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ మం డల యూత్ అధ్యక్షులు గుమ్మల వీరస్వామి ఆధ్వర్యంలో ముక్కుడు పోశమ్మ ఆలయ ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన యూత్ సమ్మేళనంలో జిల్లా యూత్ అధ్యక్షులు కొగిల మహేష్, సొసైటీ చైర్మన్ తోట రమేష్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అభివద్ధి కార్యక్రమాలు ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, జీవ వైవిధ్య డైరెక్టర్ కర్రీ శ్యాంబాబు, మేడారం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్, చిట్టీమల్ల సమ్మయ్య, పోలిన హరిబాబు, సొసైటీ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, మలికంటి శంకర్, బడిశ నాగ రమేష్, మహిళా మండల అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి, పార్వతి, రాజమల్ల సుకుమార్, చల్లగురుగుల తిరుపతి, గ్రామ కమిటీల అధ్యక్షులు మండల సోషల్ మీడియా ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు షెడ్లు నిర్మించాలి : వార్డు సభ్యులు

నవతెలంగాణ - ములుగు



ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి చిరు వ్యాపారుల కోసం జడ్పీ నిధుల నుండి షెడ్లు నిర్మించాలని, చిరు వ్యాపారులకు శాశ్వత ప్రాతిపదికన షెడ్డు నిర్మాణం చేపడితే చిరు వ్యాపార అవసరాలు తీరుతాయని మల్లంపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఎంపీటీసీలు కోరారు. బుధవారం జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్‌ను మల్లంపల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సాధ్యా సాధ్యాలను పరిశీలించి షెడ్ నిర్మాణాల గురించి ఆలోచిస్తామని చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రభాకర్, వార్డు సభ్యులు నరహరి, శ్రీకాంత్, సంతోష్, అనిల్ రెడ్డి, శ్రీను, రాజు , అయిలయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్టానెట్ సోర్స్ ఏర్పాటు చేసుకోవాలి

- ఎంపీపీ మల్హర్‌రావు

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో నెలకొంటున్న తాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా ఆల్టానెట్ సోర్స్ ఏర్పాటు చేసుకోవాలని ఎంపిపి చింతలపల్లి మల్హర్‌రావు ఆదేశించారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ నరసింహమూర్తి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రయివేటు పాఠశాల దోపిడీ పెరిగిపోయిందని, సంబంధించిన ఎంఈఓ పర్యవేక్షణ కరువైపోయిందని,రైతుబంధు పథకంపై గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు పూర్తి అవగాహన నిర్వహించడం లేదని, నిర్మాణం పూర్తియిన ఇంకుడు గుంతల బిల్లులు, మిషన్ భగీరథ నీరు రావడం లేదని, గ్రామాభివద్ధి వచ్చిన నిధులను సమాచారం లేకుండా అధికారులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారని, దుబ్బపెట స్మశాన వాటిలో నీరు లేదని సర్పంచ్ లు శనిగరం రమేష్, అజ్మీరా ప్రమిలా, ఎంపిటిసిలు ఏనుగు నాగరాని లక్ష్మీ నారాయణ, బడితేల స్వరూప రాజయ్య నిలదీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. తాడిచెర్ల, రుద్రారం,ఆన్ సాన్ పల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లుగా తెలిసిందని, మిషన్ భగీరథ తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది కాబట్టి, ఆల్టానెట్ ఏర్పాటు చేస్తూ ప్రజలకు నీటి సమస్యలు తీర్చాలన్నారు. రైతులు చెరువుల్లో మట్టి,వాగుల్లో ఇసుకను తరలిస్తే అధికారులు అడ్డుకోవద్దన్నారు. సర్పంచ్ లు, కార్యదర్శులు సోదారబావంతో గ్రామలభివద్ధికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, పిఏసిఎస్ ఇంచార్జి చైర్మన్ ప్రకాష్ రావు, మంథని మార్కెట్ చైర్మన్ అనంత రెడ్డి, పశు వైద్యాధికారి జగపతి రావు,ఏపీఓ హరీష్,ఎంపిటిసి ప్రకాష్ రావు, ఆర్ఐ సరితా, అంగన్‌వాడి సూపర్ వేజర్ సరస్వతి, ఆయా మండలాల సర్పంచ్, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ పట్టా పంపిణీ

నవతెలంగాణ-గణపురం



మండల పరిధి చెల్పూర్ గ్రామంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం లో విజయవంతంగా విద్యనభ్యసించిన విద్యార్థులకు బుధవారం గ్రాడ్యుయేషన్ పట్టాను పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన విలువలు,ఆశయాలు,లక్ష్యాలు ఏర్పరచుకొని భావి భారత నిర్మాణాన్ని సరైన రీతిలో పొందుపరిచేందుకు ప్రీ ప్రైమరీ యూకేజీ తరగతుల విద్యార్థులు ప్రైమరీ తరగతులకు ప్రమోషన్ పొందినట్లు తెలిపారు. నేటి బాలలే రేపటి ఉన్నత పౌరులు అన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం విద్యార్థి భవిష్యత్తుకు పునాది లాంటిదన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పట్టుదల నేర్పు, ఓర్పు కలిగి ఉండాలన్నారు. అంకిత భావంతో అత్యున్నత విద్యను అందిస్తున్న టీచర్లకు శుభాభినందనాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి రమాదేవి ,సిలువేరు శ్రీనివాస్ ,ప్రిన్సిపల్ మధుకర్ ,ప్రీ ప్రైమరీ ,ప్రైమరీ ,హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొనన్నారు

ఎమ్మెల్యే సీతక్క పరామర్శ

నవతెలంగాణ - ములుగు

ములుగు పట్టణలోని పాల్ సాబ్ పల్లి గ్రామానికి చెందిన పొలు లక్ష్మి ఇటీవల మరణించగా వారి పార్థివ దేహానికి ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క బుదవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే గ్రామానికి చెందిన జంగా సుగుణ ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని,



హెూంగార్డ్ నర్సింగారావు కుమారుడు శ్రీకాంత్ అనారోగ్యంతో భాద పడుతుండగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్,ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నల్లెల భరత్ కుమార్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను అధికారి పరిశీలన

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని ఓడితల గ్రామ పంచయతీలో నర్సరీ, బీపీపీవీ,పీపీవీ పనులను బుధవారం డిఆర్డిఏ పిడి పురుషోత్తం పరిశీలించారు. ఓడితల గ్రామపంచాయతీ పరిది బహత్ పల్లె ప్రకతి వనాలు నర్సరీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ కూలీలను పని వివారాలు కొలతలు రోజు వారి కులీ రేటు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం చేయకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రామయ్య , ఏపీఓ అలీం, ఈఈ రంజిత్ కుమార్, టీఏ అపర్న, సర్పంచ్ సాంబలక్ష్మి ఎఫ్ఏ రాజు, ఎస్ఎంఎంఎస్ రాకేష్, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



మహదేవపూర్‌లో వారాంతపు సమీక్ష

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణిబాయి అధ్యక్షతన బుధవారం వారాంతపు సమీక్ష సమావేశం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించారు. ఎంపీడీవో ఏ రవీంద్రనాథ్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున నర్సరీలో మొక్కలు చనిపోకుండా షేడ్ నెట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం సాయంత్రం, వేళల్లో మొక్కలకు నీటిని పట్టించాలని అన్నారు. 100శాతం మొక్కలు బ్రతికించి హరితహారం సీజన్ ప్రారంభం నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. కూలీలకు అధిక మొత్తంలో ఉపాధి కల్పించుటకు ప్రతి గ్రామపంచాయతీకి 200కు తగ్గకుండా కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేటట్లు అవగాహన కల్పించాలన్నారు. గత హరితహారంలో నాటిన మొక్కలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా వాచర్ల సహాయంతో నీరును పట్టించాలని ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ప్రతిరోజు సానిటేషన్ నిర్వహించాలని, ఎక్కడైనా తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులు పూర్తికాకుంటే వారం రోజులలోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రసాద్, ఏపీవో రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు



మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- మంత్రులకు ఎంపీపీ వినతి

నవతెలంగాణ-మహాదేవపూర్

మండల అభివద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయితీ శాఖా మంత్రి ఎరవెల్లి దయాకర్ రావు,శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఎంపిపి రాణీ బాయి రామారావు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. మారుమూల అటవీ మండలం అయిన మహాదేవపూర్ మండల అభవద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా రామప్ప దేవాలయం లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రులను కలిన వినతి పత్రాలు సమర్పించామన్నారు. మండలం లోని సూరారం, మహాదేవపూర్, బెగులూరు, కుదురుపల్లి, రాపల్లికోట, అన్నారం, ఆంబట్ పల్లి, మెట్ పల్లి, బిరాసాగర్ గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, అంగన్ వాడి భవనాలు, కమ్యూనిటీ హాల్ లు, కాంపౌండ్ వాల్ లు, స్కూల్ భవనాలు నిర్మాణం కోసం రూ. కోటి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.. త్వరలోనే మండల అభివద్ధి కోసం నిధులు మంజూరు చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు.



జెడ్పీ సీఈఓకు సన్మానం

నవతెలంగాణ-మహదేవపూర్

మండల ప్రజా పరిషత్ కార్యాలయంకు బుధవారం నూతనంగా జెడ్పీసీఈఓ విజయలక్ష్మి వచ్చారు. ఎంపీడీవో రవీంద్రనాథ్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీపీ రాణి బాయి రామారావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పలిమెల ఎంపీడీవో ప్రకాష్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో రమేష్, ఇంజనీర్ శ్రీకాంత్, మహాదేవపూర్, పలిమెల మండలాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు జెడ్పీ సీఈఓ కాలేశ్వరం దేవస్థానం వెళ్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం కాలేశ్వరం గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన నర్సరీలను సందర్శించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శికి ఫీల్డ్ అసిస్టెంట్‌కు పలు సూచనలు చేశారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లా పరిషత్ పాఠశాల లోచేపట్టిన పనులు పరిశీలించారు. మెట్పల్లి గ్రామపంచాయతీని సందర్శించి లైబ్రరీ పరిశీలించారు. కాలేశ్వరం సర్పంచ్ వేన్నపురెడ్డి వసంత, ఎంపీటీసీ రేవల్లి మమత, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఏఈ రవీందర్, ఈజీఎస్ ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి

మండలంలోని పోతుగల్లు గ్రామం వాగు నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. పోతుగల్లు వాగు నుంచి అదే గ్రామానికి చెందిన రేనుకుంట్ల శ్యాం ఉదయం రిజిస్ట్రేషన్ లేని ట్రాక్టర్ తో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు.ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రవాణా చేస్తుండగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చిట్యాల : అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్లేటి రామయ్య పల్లి గ్రామ సమీపంలో పోలిస్ సిబ్బంది తనిఖీ చేస్తున్న క్రమంలో నవాబుపేట వైపు నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. గ్రామంలో పట్టుకొని వివరాలు ఆరా తీయగా నవాబుపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్ మహమ్మద్ అని తెలుపగా అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను స్వాధీన పరచుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీలో హెచ్‌సీ సురేందర్, కానిస్టేబుల్ అశోక్, లాల్ సింగ్ పాల్గొన్నారు.







మున్సిపాలిటీ కార్మికులతో గ్యాంగ్ వర్క్



నవతెలంగాణ-కాజీపేట

రంజాన్ పర్వదినం పురస్కరించుకొని 63వ డివిజన్ పరిధిలోని ఈద్గా పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ విజయశ్రీరజాలి మున్సిపాలిటీ సిబ్బందిచే బుధవారం గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ సమీపించడంతో 63వ డివిజన్‌లోని ఈద్గా పరిసర ప్రాంతాలలో చెత్త చెదరాన్ని కార్మికులతో శుభ్రం చేయించడం జరిగింది. రంజాన్ రోజున భక్తులకు నమాజ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, జవాన్లు రవి, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

218 మందికి కంటి అద్దాల పంపిణీ



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడపాక రెండో విడత కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న 218 మందికి బుధవారం సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరంలో 18 ఏళ్ల పైబడిన గ్రామస్తులందరికీ డాక్టర్ రవీంద్ర, సుగుణలతో కూడిన వైద్య బందం కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 218 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని, శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఎంజిఎంకు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, రవీందర్, దిలీప్, హెల్త్ అసిస్టెంట్ రోజ్లిన్, సాంబలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ గౌస్ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం



ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్
కొత్తూరులో ఘనంగా గౌస్ ద్వితీయ వర్ధంతి
51ఫీట్ల స్మారకస్థూపాన్ని ఆవిష్కరించిన నేతలు

నవతెలంగాణ-రాయపర్తి

ఎంసిపిఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ కరోనా మహమ్మారికి బలైన కామ్రేడ్ మహమ్మద్ గౌస్ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎంసీపీఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. గౌస్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. 51ఫీట్ల ఎత్తైన స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన మహానుభావుడు గౌస్ అని కొనియాడారు. వెనుకబడిన ప్రజలకు అండగా నిలిచి వారికి చైతన్యం నింపిన కామ్రేడ్ గౌస్ సేవలు మరువలేనివి అన్నారు. అనుక్షణం బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పోరాడిన గౌస్ జీవితం చరిత్ర పుటల్లో నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెరిగిపోతున్న నియంతృత్వ మతోన్మాద విధానాలను నిర్మూలించకుంటే ప్రజలకు భవిష్యత్తు ఉండదని అందుకోసం సామాజిక వామపక్షశక్తులు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎం పీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మంగ్రరామ్ పాస్ల, ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ కిరణ్ జీత్ సింగ్ షేఖాన్, ఎంసిపిఐ(యు) పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, ఆర్ఎంపీఐ చైర్మన్ గంగాధరన్, ఎంసిపిఐ (యు) పార్టీ పోలిట్ సభ్యులు కామ్రేడ్ రాజాదాస్, కాటంనాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, వనం సుధాకర్, బత్తిని కుమారస్వామి, సుంచు జగదీశ్వర్, మండల కార్యదర్శి గుగులోత్ అరుణ్ నాయక్, సుల్తాన్ సారయ్య, తానికొండ రంగారావు, కందికట్ల సంతోష్, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులపై తూర్పు ఎమ్మెల్యే ఫోకస్



43 సెంటర్లలో ఆవాసాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు ఏర్పాట్లు
గుడిసెలకు ఇంటి నంబర్ల కేటాయింపు
జీవోలు 58, 59పై అవగాహన కార్యక్రమాలు
ఆన్ లైన్‌కు మీ సేవా సెంటర్లు సొంత ఖర్చులతో నిర్వహణ
పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే నరేందర్

నవతెలంగాణ-వరంగల్

గుడిసెవాసులపై తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కొనసాగిస్తున్న కార్యక్రమం ముమ్మరంగా ముందుకు సాగుతున్నది. వేలాది మంది గుడిసెవాసులను కదిలించడం లో ఎమ్మెల్యే తీసుకున్న కార్యాచరణ విజయ వంతానికి అహర్నిశలు శ్రమిస్తున్న రనే చర్చ ప్రజల్లో సాగుతున్నది. చాలాఏళ్ల క్రితం ఆయా ప్రాంతాల్లో పేదలు గుడిసెలు వేసుకుని బతుకుతున్నారు. కనీస వసతులు కూడా లేని ఆ ప్రాంతంలో వారి మనుగడ దినదిన గండంగా కొనసాగుతూ వచ్చింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 43 సెంటర్లలో గుడిసెవాసుల ఆవాసాలున్నాయి. నన్నపునేని నరేందర్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో ఈ గుడిసె ఆవాసాల్లో కనీస వసతుల కల్పనకు ముందుకు సాగారు. రహదారులు, మంచినీటి సౌకర్యం, వీధిలైట్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఆయా ఆవాసాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నట్లైంది. అనంతరం నరేందర్ గుడిసెలకు మున్సిపల్ ఇంటి నంబర్లు ఇచ్చే విషయమై పట్టుదలతో పనిచేసి ఆ మేరకు జరిపిన కృషి ఫలించింది. అన్ని సెంటర్లలో ఉన్న గుడిసెలకు ఇంటి నంబర్లు రావడంతో తమ గుడిసెలో జీవనం కొనసాగుతుందనే భరోసా పేదల్లో నెలకొంది.

అటు అవగాహన.. ఇటు ఆన్ లైన్

నరేందర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం పూర్తిస్థాయిలో ఈ సెంటర్లపై శ్రద్ధ చూపారు. జీవో నంబర్ 58,59 ఆధారంగా గుడిసెల్లో నివసించే వారే ఓనర్లుగా గుర్తించే క్రమం ప్రస్తుతం కొనసాగుతున్నది. అధికారిక కార్యక్రమాలను పరిశీలిస్తే గుడిసెవాసులు జీవో ప్రకారం కొన్ని ప్రతులను ఆన్ లైన్ చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఆ తదుపరి పరిశీలన అనంతరం ఓనర్ సర్టిఫికెట్ లభిస్తుంది. అందువల్ల ఆన్ లైన్ చేసుకోవడమనేది ప్రాముఖ్యత, ఖర్చుతో కూడుకున్నదనే నేపథ్యంలో గుడిసెవాసులకు ఆన్‌లైన్‌పరంగా ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే భరించడంతో పాటు మీసేవా కేంద్రాలను ఆయా సెంట ర్లలో ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి ప్రారంభించారు. అంతకుముందు జీవోలపై అవగాహన కల్పించేందుకు అనేక సెంటర్లలో ఎంతో సమయాన్ని వెచ్చించి ఎమ్మెల్యే వారికి అవగాహన కల్పించారు.

ఈ అవగాహన కార్యక్రమాల వల్ల ఎమ్మెల్యేకు, గుడిసె వాసులకు మధ్య అవినాభావ సంబంధం ఏర్పడినట్లు కనిపిస్తున్నది. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పూర్తికానుంది. దరఖాస్తు చేసుకునే విషయంలో గుడిసెవాసులకు అన్ని వేళల్లో సహకరించేందుకు ఆ విషయంలో అనుభవం ఉన్నవారిని అందుబాటులో ఉంచారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్ లైన్ కార్యక్రమం ముగియనుంది.

పేదల కళ్లల్లో వెలుగును నింపాలే : ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



చాలా ఏళ్లుగా గుడిసెల్లో నివసిస్తున్న ఎన్నో కష్టాలు పడుతున్న పేద ప్రజలను చిన్నప్పటి నుంచీ గుడిసెవాసుల బాధలను దగ్గర ఉండి చూసిన, వారి గుడిసెలకు హక్కు పత్రాలు ఇప్పించేంత వరకు విశ్రమించను. ఆన్‌లైన్ దరఖాస్తు కోసం అవసర మయ్యే ఫీజును నేనే భరిస్తున్నా. పేదలపై ఎలాంటి ఆర్థిక భారం పడనీయను. జీవోలపై అవగాహన కోసం రాత్రి పొద్దుపోయే వరకు కూడా నిద్ర పోకుండా సదస్సులను జయప్రదం చేసిండ్లు.. సందేహాలను నివృత్తి చేశా, ఇప్పుడు ఆవాసాల్లో అనూహ్యమైన ఉత్సాహం చోటుచేసుకుంది. పట్టాను సాధించాలనే ఇన్నేండ్ల కలను నెరవేర్చి ఆ పేదల కళ్లల్లో వెలుగును నింపాలనే పట్టుదలతో ఉన్నాను.

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి : ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ-కమలాపూర్



రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం మండల మండలంలోని కమలాపూర్ గూడూర్ ఉప్పల్ ఉప్పలపల్లి గ్రామాలలో ఐకెపి, సొసైటీ కొనుగోలు కేంద్రాలను ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని కొనియాడారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత కరెంట్, రైతుబంధు రైతుబీమా వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ రైతు కాబట్టి రైతులు ఆర్థికంగా ఎదగడం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని మరొకసారి గుర్తు చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతులు పండించిన పంటను నేరుగా ఐకెపి సొసైటీల కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరపొందాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోగా రైతు వ్యతిరేక విధానాల చట్టాలను తీసుకురావాలని చూసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు రాబోయే రోజుల్లో ఏ ముఖం పెట్టుకొని రైతుల వద్దకు వస్తారని అన్నారు. రాష్ట్రంలో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎవరు కూడా అధైర్యపడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పిటిసి కళ్యాణి లక్ష్మణరావు, సింగిల్ విండోచైర్మన్ సంపత్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గాడ్సే వారసులను గద్దె దించాలి

ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



నవతెలంగాణ-హనుమకొండ

దేశంలో గాడ్సే వారసులను గద్దె దించాలని, మతతత్వ పార్టీ నుండి దేశాన్ని రక్షించుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం వాల్ పోస్టర్‌లను హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాటాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెంచుకుంటూ పోతూ పేద మధ్యతరగతి జీవితాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దుర్భరం చేస్తున్నదని అన్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా దోచిపెడుతున్నదని, రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయలేని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లరూపాయలు రుణమాఫీ చేస్తున్నదని విమర్శించారు.పెరుగుతున్న నిరుద్యోగం,పేదరికం,ద్రవ్యోల్బణం తగ్గించకుండా మత రాజకీయాలు చేస్తూ యువతను పక్కదారి పట్టిస్తూ మోడీ అధికారం అనుభవిస్తున్నాడని అన్నారు. దేశంలో ఉన్న అన్ని స్వతంత్ర రాజ్యంగ సంస్థలను తన ఆధీనంలోకి తెచ్చుకొని ఆ మాత్రం మిగిలి ఉన్న న్యాయవ్యవస్థను కూడా శాసించటానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారనీ ఆవేదన వ్యక్తం చేశాడు.

దేశాన్ని,ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రమాదంలోకి నెడుతున్న బిజెపి,దాని అనుకూల శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవడానికే ఈ కార్యక్రమం అని తెలిపారు. ప్రజలు భాగస్వాములై రాబోయే రోజుల్లో సీపీఐ చేసే పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీజేపీకి హఠావో-దేశ్ కో బచావో..నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఇంటిఇంటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి జిల్లా నాయకులు మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బడి ముందు బాధితుల నిరసన



నవతెలంగాణ-కమలాపూర్

ప్రభుత్వ పాఠశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు బుధవారం ఉన్నత పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల పాత భవనం కూల్చివేసి కొత్త భవనం నిర్మించడానికి పాఠశాల పక్కనే ఉన్న మా భూము లను మాజీ మంత్రి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాటమీద స్కూల్ నిర్మాణం కొరకు కేటాయించారు. మాకు భూమికి బదులు 895 సర్వే నెంబర్‌లో భూమిని తిరిగి ఇస్తూ అదే భూమిలో మీకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం ఏర్పాటు చేస్తామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. భూమిని స్కూల్ నిర్మాణం కొరకు ఇచ్చిన 2016 నుండి ఇప్పటివరకు కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా తమ బాధను ఏ ఒక్కఅధికారి కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి భూమికోల్పోయిన తమకు తిరిగి భూమిని కేటాయించి న్యాయం చేయాలని బాధితులు మారం ఎల్లమ్మ, కొడాలి మల్లమ్మ, తోట రాజు, శానభక్తుల శివ జ్యోతి కోరారు.

ఆలయ ప్రాకార మండపం రాజగోపాల పనుల పరిశీలన



నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట మండలం మడికొండ నందుగల చారిత్రక మెట్టుగుట్టపై స్వయం భుగా విరజిల్లుతున్న దక్షిణ కాశీ హరిహర క్షేత్రం శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం అధికారులు స్థాపతి వల్లినాయగం, సహాయకస్థాపతి, పర్యవేక్షక ఇంజనీరింగ్ మల్లికార్జున్ రెడ్డి, వరంగల్ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రమేష్, సహాయక ఇంజనీర్ చందర్ లు దేవాలయాన్ని సందర్శించి. స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వారు దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం కాబోతున్న ఆలయ ప్రాకారమండపం రాజగోపురం పనులను పరిశీలించి సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరశారం విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ ధర్మకర్తలు కుమారస్వామి, భూపాల్‌రెడ్డి, సంధ్యారాణి, రాజు,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీడీఆర్ ఆధ్వర్యంలో తహశీల్దారుకు వినతి



నవతెలంగాణ-వేలేరు

ఓపిడిఆర్ ఆధ్వర్యంలో గ్రామీణ పేదల సంఘం కన్నారం గ్రామ పరిధిలోని 211 ఎకరాల ప్రభుత్వ పంచారాయి భూమిని పేదలకు పంచి హక్కు పత్రాలు ఇవ్వాలని, బోర్లు మంజూరు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వేలేరు తహసీల్దారుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకుముందు పలుమార్లు వినతిపత్రం అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనతీవ్రతరం చేస్తామన్నారు. గ్రామంలోని దళితులం దరికి దళితబంధు వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నాల సమ్మయ్య, కార్యదర్శులు ఇల్లందుల శోభన్ బాబు, మొగిలిచెర్ల వీరస్వామి, ఓపిడిఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మార్క వెంకటయ్య, ఇజ్జగిరి రవీందర్, కాశబోయిన ఎల్లయ్య, బోళ్ల కనకయ్య, కొల్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మోడెం రిషీకి ఎమ్మెల్సీ పల్లా ఆర్థిక చేయూత



నవతెలంగాణ-వేలేరు

దక్షిణాసియా సాఫ్ట్ బెస్ బాల్ పోటీలకు ఎంపికైన మండలంలోని మల్లికుదుర్ల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి మోడం రిషీకి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక చేయూతనందించారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇచ్చిన రూ.50 వే లు జెడ్పీటీసీ చాడ సరిత చేతుల మీదగా జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో ఆ విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సరిత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగాల్లో రాణించాలని విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మే 9, 10 తేదీల్లో భూటాన్ దేశంలో జరిగే క్రీడలో రిషీ పాల్గొననున్నారు. విద్యార్థి ప్రతిభను తీర్చిదిద్దిన పీఈటీ సుమలత సేవలను కొని యాడారు.

ఈకార్యక్రమంలో హెచ్ఎం దుర్గాభవాని, సర్పంచ్ గోదల రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ సంపత్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ సురేష్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నార్లగిరి ప్రవీణ్, భూపతి రాజు, ప్రభాకర్, కో-ఆప్షన్ జానీ భగవాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్‌షెడ్ హమాలీ కార్మికులకై అవసరమైతే ఆమరణ దీక్ష

ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్



నవతెలంగాణ-మట్టెవాడ

రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ కార్మికులకు అండగా నిలబడి పోరాడుతూ అవసరమైతే కార్మికులకు న్యాయం జరిగడం కోసం ఆమరణ నిరహార దీక్షకు కూడా సిద్ధమేనని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షేడ్ చింతలపల్లికి తరలివెళ్తున్న నేపథ్యంలో వరంగల్ సౌత్ సెంట్రల్ రైల్వే షావుకారి హమాలీ యూనియన్ గూడ్స్ షెడ్ తరుపున 225 మందికి ఉపాధి కోల్పోతామె అని ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు బుధవారం వెళ్లారు. ఈ సందర్భంగా కార్మికులు వారి బాధను ఎమ్మెల్యేకు చెప్పుకున్నాడు. అనంతరం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మిక బిడ్డను కాబట్టి మీలో ఒకడినైన తనకు హమాలీ కార్మికుల కష్టాలు తెలుసన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే తానే స్వయంగా అమర నిరాహార దీక్షకు పూనుకుంటానని హామీఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, జెడ్ఆర్‌సిమెంబెర్ చింతాకుల సునీల్, యూనియన్ గౌరవ అధ్యక్షులు కక్కే సారయ్య, అధ్యక్షులు అయూబ్ ఖాన్, శివ, రాజశేఖర్, హరి, దేవేందర్ యూనియన్ హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కూతురిని చంపి తల్లి ఆత్మహత్య

వరకట్న వేధింపులు తాళలేక ఆత్మహత్య
కుటుంబ సభ్యులపై ఫిర్యాదు : తరాలపల్లిలో విషాద ఛాయలు



నవతెలంగాణ-కాజీపేట

కూతురి గొంతు నులిమి చంపి అనంతరం తల్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం కాజీపేట మండలం 45వ డివిజన్‌పరిధిలోని తరాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక మడికొండ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు తరాల పెల్లి గ్రామానికి చెందిన ఈరబోయిన అనిత (26)ను ఈరబోయిన రాకేష్‌తో 2018లో వివాహం జరిగింది. అనిత తల్లిదండ్రులు వరకట్నం కింద 20 గుంటల భూమిని ఇస్తామని చెప్పారు. పెళ్లయినమొదట్లో సంతోషంగా ఉండేవారని గత సంవత్సరం కాలం నుండి భార్యాభర్తల మధ్య వరకట్న విషయంలో గొడవలు రావడంతో పెద్దమనుసుల సమక్షంలో మాట్లాడుకోవడం జరిగింది. రాకేష్ తమకు వరకట్నంగ ఇస్తానన్న భూమిని ఇవ్వాలని, అట్టి భూమిని అమ్మేస్తానని పలుమార్లు భార్య అనితతో గొడవలు పడేవాడు. ఇటీవల రాకేష్ కుటుంబ సభ్యులు వరకట్నం తేవాలంటూ అనితను తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అనిత తన కూతురు శివ శాన్విక (4) గొంతు నులిమి చంపి, అనంతరం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు అనిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలు అనిత తల్లిదండ్రులు నీలం నారాయణ, అలివేలు తమ కూతురు అత్తంటి వరకట్నం వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందని ఆత్మహత్యకు కారకులైన భర్త రాకేష్, అత్త మామ బిక్షపతి, రమ, మరిదిలు వినోద్‌లను కఠినంగా శిక్షించాలని దరఖాస్తు ఇవ్వడం జరిగిందన్నారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజియం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది అన్నారు. ఆత్మహత్యకు గల కారణాల కొరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీతంపేట చెరువులో నీటి చౌర్యం

చోద్యం చూస్తున్న అధికారులు-చర్యలు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని సీతంపేట చెరువులో కొంత మంది మత్స్యకారులు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల కోసం చెరువు నీటి చౌర్యానికి పాల్పడుతూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చెరువు నీటి చౌర్యాన్ని కాపాడి నిబంధనలకు విరుద్ధంగా చెరువు నీటిచౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ బండారి రజితచేరాలు, మాజీ సర్పంచ్ నద్దునూరి చేరాలు, ఉపసర్పంచ్ భగవాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్ధన్, గంప రవి, యుగందర్, యాదగిరి, రాజయ్య, నక్కరాజు, సమ్మయ్యలు డిమాండ్ చేస్తున్నారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పట్టేందుకు నీటిని వృథాచేయడం వల్ల రైతులు పంట సాగు చేసుకోవడానికి, పశువులకు తాగునీటికి కటకట ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఒక తూము షట్టర్ పగులగొట్టడమే కాకుండా రెండు తూముల ద్వారా చెరువు నీటిని నిబంధనలకు విరుద్ధంగా వృధాగా వదులుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మత్స్యకారులకు పలుమార్లు చెప్పినప్పటికి పట్టించుకోకుండా రాత్రివేళలో చెరువునీటిని దొంగతనంగా వదులుతున్నారని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఐబీ, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సీ తంపేట చెరువు నీటి చౌర్యానికి పాల్పడడమే కాకుండా రైతులకు నష్టం కలుగజే స్తున్న మత్స్యకారులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించి ఇటువంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు వే డుకుంటున్నారు.

మంగ్యాతండా సర్పంచ్‌కు ఢిల్లీకి ఆహ్వానం

నవతెలంగాణ-పర్వతగిరి

పీఎం మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ లో భాగంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి ఆహ్వానం అందినట్లు ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. 2022 ఆగస్టు 28న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమంలో మంగ్యా తండా గ్రామపంచాయతీలో అభివృద్ధి చేసిన నీటి కుంట (అమృత్ సరోవర్) గురించి మాట్లాడారు.పశువులకు, ఇతర జంతువులకు తాగునీటి కొరత తీరిందని తెలిపారు. అమత్ సరోవర్ కుంటను అభివద్ధి చేసిన గ్రామస్తులకు,ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ నుండి ఆరుగురు వ్యక్తులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంగ్య తండా గ్రామ సర్పంచ్ ఈర్యా నాయక్ తో కలిసి హాజరు కానున్నట్లు ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్ తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



నవతెలంగాణ-వేలేరు

పేదల సంక్షేమమే కేసిఆర్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. వేలేరు మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మీ, షాధిముబారఖ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని 27 మంది లబ్దిదారులకు రూ. 27,03,132 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ దేశంలోనే పేద, బడుగు బలహీనవర్గాలప్రజలకు, అండగా నిలుస్తున్నది కేసీఆర్ నాయకత్వంలో నడుస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీ అంగోత్ సంపత్,కో-ఆప్షన్‌సభ్యులు మొహమ్మద్ జానీ, తహశీల్దార్ సమ్మయ్య, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ





నవతెలంగాణ-హసన్‌పర్తి

వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బుధవారం వర్ధన్నపేట నియోజకవ ర్గంలోని విలీన గ్రామాలతో పాటు పంచాయతీ గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి మృతుల కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ అరేపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ బుద్దే సురేందర్ అమ్మ ఇటీవల అనారోగ్యంతో మతి చెందగా వారి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేతపాక రఘు ఇటీవల అనారోగ్యంతో మతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఎంపీపీ కేతపాక సునితరాజు, స్థానిక డివిజన్ కార్పొరేటర్, డివిజన్ నాయకులు, జంగ కుమార్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, కేతపాక చిన్న, పలువురు ప్రజా ప్రతినిదులు మండల నాయకులున్నారు.







35 వేల రూపాయల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని లకావత్ తండ గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన లౌడియా ప్రమీల-రవీందర్ దంపతుల కుమారుడికి ఫీవర్‌తో న్యూమోనియా రావడంతో ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని డాక్టర్లు తెలిపారు. డబ్బులు ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమత లేకపోవడంతో లకావత్‌తండా ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని యువ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన శ్రీకాంత్ గౌడ్ చిన్నారి కుటుంబ సభ్యులకు బుధవారం 35 వేల రూపాయల నగదు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బస్వ మల్లేష్, ధర్మపురం ఎంపీటీసీ లౌడియా ఉపేందర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లకవత్ లాలు, కారుపోతుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన అర్చకులు



నవతెలంగాణ-పాలకుర్తి

కేంద్ర ప్రభుత్వం అందజేసిన అవార్డులలో తెలంగాణలో 13 గ్రామపంచాయతీలకు అవార్డులు రావడం పట్ల బుధవారం అర్చక జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డివిఆర్ శర్మతోపాటు, శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ డైరెక్టర్ కోడూరు నరసింహారెడ్డిలు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి అభినందనలు తెలిపారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాదంతో పాటు శేష వస్త్రాలతో మంత్రి ఎర్రబెల్లిని సత్కరించారు. ఈ సందర్భంగా డివిఆర్ శర్మ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ నుండి గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కేంద్రం అందించే అవార్డుల స్ఫూర్తితో తెలంగాణలోని మరిన్ని గ్రామాలు అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.



దళితబంధు యూనిట్లు పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న దళిత బంధు యూనిట్లను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య మంగళవారం పరిశీలించినట్లు ఎస్సీ కార్పోరేషన్ ఈడి డాక్టర్ వెంకన్న తెలిపారు. ఈ పథకం ద్వారా దళితులకు రూ.10 లక్షల మేరకు లబ్ది చేకూరుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 185 మందికి దళిత బంధు యూనిట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. దళిత బంధు యూనిట్ల పని తీరు పట్ల రాష్ట్ర మంత్రి దయాకర్ రావు, స్థానిక శాసన సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్యలు తమ ద్వారా ఆరా తీస్తున్నారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో దళిత బంధు యూనిట్లు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పాలకుర్తి మండలం తీగారంగ్రామం,లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామాల్లోని యూనిట్లను కలెక్టర్ పరిశీలించినట్లు ఈ.డి. పేర్కొన్నారు.

బట్టి విక్రమార్క యాత్ర విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తరిగొప్పుల

ఈనెల 26న జరిగే బట్టి విక్రమార్క యాత్ర రూట్ మ్యాప్‌ను మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య బుధవారం పరిశీలించారు. మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014 నుండి నేటి వరకు రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలిస్తున్న నాయకులు ఎవరికి తోచినంతగా వాళ్ళు దోచుకుంటూ అమాయక ప్రజల మీద భారం మోపుతున్నారని ఇకనైనా ప్రజలు మేల్కొని హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ప్రజలు తమ కష్టాలను దూరం చేసుకోవాలని అన్నారు. ఈనెల 26న జరిగే బట్టి విక్రమార్క యాత్ర మండలంలోని అబ్దుల్ నాగారం, నర్సాపూర్, మరియాపూర్, గ్రామాల నుండి యాత్ర కొనసాగుతుందని, యాత్రకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మండల జడ్పిటిసి కొండల్ రెడ్డి, కొమురవెల్లి మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చిలువేరు సంపత్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు కావటి సుధాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పండుగ సంపత్, మూల రాములు, తీగుళ్ల బాలు, పరుశరాములు, సంపత్ రెడ్డి, ఏదునూరి సుధాకర్, భాష బోయిన రాజు, సుంకరి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు పేదవాడికి వరం : సర్పంచ్



నవతెలంగాణ-తరిగొప్పుల

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం పేదవాడికి వరంలా మారిందని సర్పంచ్ ఆర్జుల రమా సంపత్ రెడ్డి బుధవారం అన్నారు. మండల పరిధిలోని అబ్దుల్ నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ వారి సేవలు అమోఘమని కొనియాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో మొత్తం 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 183 మందికి వెంటనే పరీక్ష చేసి వారి సమస్యకు తగిన కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగతా 242 మందికి వారి సమస్యకు తగ్గ కంటి అద్దాలను ఆర్డర్ పై తెప్పించి ఇస్తామన్నారు. అనంతరం మెరుగైన సేవలు అందించిన వైద్య బృందానికి సర్పంచ్ దంపతులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న ప్రసాద్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను పురస్కరించుకొని డివిజన్ కేంద్రానికి చెందిన పంచకళా హ్యాండీక్రాఫ్ట్స్ ఆర్టిసాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జీడి ప్రసాద్‌కు రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు అందించింది. ఈ మేరకు బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీడీ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ దళితరత్న అవార్డుతో తన భాద్యత మరింత పెరిగిందన్నారు. సామజిక సేవలో, బడుగు బలహీన వర్గాలు, దళితుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, రాష్ట్ర రైస్ మిలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బెలిదే వెంకన్న, నీల గట్టయ్య, బూర్ల శంకర్, రాజేష్ నాయక్, గణపాక సుధాకర్ బాబు, రజాక్ యాదవ్, ఎలమకంటి నాగరాజు, యాట అశోక్, గుర్రం ఫాతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా ముందుకెళ్తే సాధించనిది లేదు

కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము

నవతెలంగాణ-బచ్చన్నపేట

సమిష్టిగా ముందుకెళ్తే సాధించనిది ఏమీ లేదని కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ సంఘ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మంచాల వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సంఘటితంగా వెళితే సాధించనిది ఏమీ లేదని సంఘటితమే బలమని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో మన కుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుండి లభించే అన్ని వనరులను సంఘటితంగా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రేపు జరగబోయే జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో కమిటీలను ఏర్పాటు చేసుకున్నాక రాష్ట్ర కమిటీని సూచించుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల భూమిలో మంచి సువిశాలంగా భవనాన్ని నిర్మించుకోవాలని అప్పుడే మనకంటూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట పట్టణ ఉపాధ్యక్షులు దాచేపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి సందెల బాల సిద్దులు,మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాడిశెట్టి కృష్ణమూర్తిమాజీ అధ్యక్షులు దాచేపల్లి నరసింహారావు, గౌరవ అధ్యక్షులు సందెల సత్యనారాయణ, బోసాని బాలరాజు, పోచన్నపేట అధ్యక్షులు బుగ్గయ్య, శ్రీను సంఘ సభ్యులు మల్యాల హరినాధం, మల్యాల అనిల్ కుమార్, దాచేపల్లి అశోక్, సందెల శ్రీధర్ ,సందెల వెంకటేష్,, సందెల అశోక్, మంచాల హరినాధం పాల్గొన్నారు.



ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఉద్యమిస్తాం

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు

నవతెలంగాణ-నెల్లికుదురు

నెల్లికుదురు మండలం ఐకెపి సెర్ప్ కార్యాలయంలో వివిధ గ్రామాలలో వివోఏలుగా విధులు నిర్వహిస్తున్న వారికి తక్షణమే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించకపోతే పోరాటాన్ని ఉధృతం చేసి ఉద్యమిస్తామని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందుసెర్ప్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె మూడోరోజుకు సంఘీభావం తెలిపి బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సెర్ప్ కార్యాలయంలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న వివోలకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వారితో వెట్టి చాకిరి చేయించుకోవడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను కూడా గ్రామస్థాయిలో వీరితో ప్రచారం చేయించుకుంటూ కనీసం గుర్తింపు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. మహిళా పొదుపు సంఘాలకు సంబంధించిన గ్రూపుల సభ్యులను ఒక వేదిక ఏర్పాటు చేసి వారి రికార్డులను రాస్తూ వారికి లోన్ ఇప్పిస్తూ ఎవరైనా కట్టకపోతే వారి ఇంటి చుట్టూ తిరిగి రికవరీ చేయించి లావాదేవీలను నడిపిస్తూ చాలీచాలని వేతనంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరిని తక్షణమే సెర్ప్ ఉద్యోగులుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించి అర్హత కలిగిన వివోఏలను సీసీలుగా పదోన్నతులు కల్పిస్తూ బీమా సౌకర్యం ఇప్పించాలని, ఎవరి ఒత్తిడి లేకుండా నేరుగా వారి అకౌంట్లో వేతనాన్ని జమ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం 26వేల రూపాయలు వీరికి అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా రాష్ట్రస్థాయిలో వీరందరి కలుపుకొని పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివోఏల మండల గౌరవ అధ్యక్షుడు బిరు యాకయ్య, మండల వివోఏల సంఘం అధ్యక్షుడు గుగులోతు హనుమంతు, సమ్మె కన్వీనర్ ఇందిరా, వివోఏలు శ్వేత నసీహత్ బేగం, విజయలక్ష్మి, కవిత, అక్కెర ఉష, చింతకుంట్ల ఉపేందర్, మంజుల, గట్టు అశోక్, గడ్డల అశోక్, హైమావతి వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

మూడవ రోజుకు చేరిన వివోఏల దీక్షలు

గార్ల : రాష్ట్ర ప్రభుత్వం వివోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.వివోఏల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ ఐకేపి ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) అధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో చేపట్టిన సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏల చేతవెట్టి చాకిరీ పనులు చేయిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వారికి పనికి తగిన వేతనం చెల్లించడానికి ముందుకు రావడం లేదని మండిపడ్డారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధిస్తున్న ప్రభుత్వం వారి సమస్యలను పెడచెవిన పెడుతున్నారని మండిపడ్డారు. గత కొంత కాలంగా వివోఏలు అనేక రకాలుగా నిరసనలు చేపట్టిన స్పందించక పోవడంతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివోఏల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ నాయకులు టి.కృష్ణ, షంషాద్ బేగం, యం.వినోద, యం.రాములు సంఘిభావం తెలిపారు.దీక్షలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కందుల శోభ, సిహెచ్ మౌనిక, బి.ఉమా, వినోద, అనిత, జ్యోతి, అరుణ, రమ, కల్పనా, లక్ష్మీ సునీత, చంద్రకళ, సరోజ, సురేష్, మంగ్యి, సైదులు తదితరులు పాల్గొన్నారు.





సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి

గూడూరు : వీవోఏలు చేపట్టిన నిర్వాదిక సమ్మె మూడో రోజుకు చేరింది. బుధవారం మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని తమ వంతు కృషిగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు నునావత్ రాధా, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నునావత్ రమేష్, మండల అధ్యక్షులు కత్తి స్వామి, అధ్యక్షుడు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కిషన్, మైనారిటీ రాష్ట్ర నాయకులుయాకూబ్ పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాజీ యూత్ అధ్యక్షుడు బుడిగే సతీష్, యూనియన్ అధ్యక్షురాలు దారం శ్రీలత, కోశాధికారి మల్లె పోయిన శ్రీలత, క్లస్టర్ బాధ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ళకు పక్కా ప్రణాళిక

జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ సంధ్యారాణి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య సూచనలు, సలహాలు, ఆదేశాలతో రైతులతో పాటు ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పక్కాప్రణాళితో ధాన్యం కొనుగోళ్ళు చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేరుస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి తెలిపారు.ప్రతిసీజన్‌లో కూడా ధాన్యం కొనుగోళ్ళలో రాష్ట్ర స్థాయిలో ఉద్యోగులందరూ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. లాంఛనంగా ఇప్పటికే దేవరుప్పుల మండలంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొనుగోలు కేంద్రాన్ని ప్రారం భించిన విషయం తెలిసిందే. ఒకటి రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా రబీ (ఎండా కాలం) సీజన్ ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కానున్న నేపథ్యంలో **'నవతెలంగాణ'** బుధవారం ఆమెతో ముఖాముఖిగా ముచ్చటించింది.

ఎంత ధాన్యం వస్తుందని అంచనా వేశారు..?

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు అంచనా వేశారు. వారి అంచనా మేరకు కొనుగోళ్ళ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అందరి సహకారంతో సమన్వయంతో పని చేసి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం.

గన్నీస్ అందుబాటులో ఉన్నాయా..?

ధాన్యం కొనుగోళ్ళ లక్ష్యం మేరకు జిల్లాకు 57 లక్షల గన్నీ బ్యాగులు అవసరం అవుతాయని ప్రతిపాదించాం. ఇప్పటి వరకు 35లక్షలు జిల్లాకు చేరుకున్నాయి. మిగతావి దశల వారీగా సరఫరా అవుతుంటాయి. గన్నీ బ్యాగుల కొరత రాకుండా చూసుకుంటాం.

కొనుగోలు కేంద్రాలు ఎన్ని..?

జిల్లా వ్యాప్తంగా 200 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని నిర్ణయించాం. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 111, సహకార శాఖ ఆధ్వర్యంలో 89 కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఎక్కడైతే ఏర్పాటు చేశామో ప్రస్తుతం కూడా అక్కడే కొనుగోళ్ల చేపట్టేందుకు చర్యలు తీసకుంటున్నాం.

రవాణా ఏర్పాట్ల గురించి చెప్పండి..?

జిల్లాలో కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని తరలించే విషయంలో రాజీ పడేది లేదు. కొనుగోళ్ళు పూర్తి కాగేనే వెంటనే ధాన్యాన్ని మిల్లర్లకు తరలించాల్సిందే. ఇందు కోసం ఒక్కో కొనుగోలు కేంద్రానికి 2 లారీల చొప్పున జిల్లా వ్యాప్తంగా మొత్తం 400 లారీలను, డిసిఎంలను సిద్ధంగా ఉంచాం. అవసరమైతే మరిన్ని వాహనాలను కూడా సమకూర్చేందుకు వెనుకాడబోం.

రా మిల్లులకెంత...బాయిల్డ్ మిల్లులకెంత..?

రా రైస్ మిల్లులకు, బాయిల్డ్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులో తేడాలుండవు. రా రైస్ మిల్లులు కేవలం రా రైస్ మాత్రమే ఇవ్వాల్సి ఉండగా బాయిల్డ్ మిల్లులు బాయిల్డ్ రైస్, రా రైస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఏ మిల్లుకు ఎంత ధాన్యం కేటాయింపు అనేది ఆయా మిల్లుల సామర్థ్యం, యంత్ర పరికరాలను బట్టి నిర్ణయం ఉంటుంది.

అంచనాకు మించి ధాన్యం వస్తే..?

ప్రస్తుతం అధికారులు ఇచ్చిన అంచనా మేరకు ధాన్యాన్ని నిలువ చేసేందుకు జిల్లాలో ఏర్పాట్లు ఉన్నాయి. ప్రస్తుతమున్న జిల్లాలోని మిలుల్లో ఆ మేరకు వసతి ఉంది. గతంలో అంచనాకు మించి రావడం వల్లనే సూర్యాపేట లాంటి ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించిన మాట వాస్తవమే. ప్రస్తుతం అటువంటి పరిస్థితి రాదనే అనుకుంటున్నాం. ఒకవేళ అంచనాకు మించి ధాన్యం వచ్చినా ఎలాంటి ఇబ్బందులుండవు.

సీఎంఆర్ గురించి చెప్పండి..?

కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) 2021-22 ఖరీఫ్ (వర్షా కాలం)లో మిల్లర్లు 100 శాతం ఇచ్చారు. 2021-22 రబీ (ఎండా కాలం)లో ఇప్పటి వరకు 92 శాతం ఇచ్చారు. మిగిలిన 8 శాతం సిఎంఆర్ రైస్ ఈ నెలాఖరు వరకు అందజేస్తామని ఇటీవల జరిగిన మిల్లర్ల సమావేశంలో మిల్లర్లుహామి ఇచ్చారు.

బయట కొనుళ్ళపై మీ నియంత్రణ ఉంటుందా..?

బయట రైస్ మిల్లర్లు చేసుకునే వ్యాపార లావాదేవీలతో మాకు సంబంధం ఉండదు. వారు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసుకోవచ్చు. అటువంటి దానిపై మా పర్యవేక్షణ ఏమి ఉండదు. మేము నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర లభిస్తుండగా రైతులు తక్కువ ధరకు ఎందుకు విక్రయించుకుంటారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, విక్రయించిన ధాన్యానికి తగిన రసీదును పొందాలని ఆమె సూచించారు.

కన్నతండ్రి విషమిచ్చిన ఘటనలో రెండో కూతురు మృతి



నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని గూడూరు గ్రామ శివారు జానకపురం గ్రామానికి చెందిన గుండె శ్రీను తన ఇద్దరు కుమార్తెలను చంపేందుకు థంసప్‌లో విషం ఇచ్చిన ఘటన ఘటన తెలిసిందే. ఆ ఘటనలో పెద్ద కుమార్తె ప్రియా (10), చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎంలో గతవారం రోజులక్రితం మృతి చెందడంతో, మెరుగైన వైద్యం కోసం రెండవ కుమార్తె నందిని (7)ని హైదరాబాదు గాంధీ ఆసుపత్రికి తరలించారు. విషం కలిపిన తంసప్ తాగడంతో నందిని మృత్యువుతో పోరాడుతూ బుధవారం గాంధీ ఆసుపత్రిలో మృతి చెందింది. దీంతో కసాయి తండ్రి ఘాతుకానికి ఇద్దరు కుమార్తెలు మృత్యువాత పడడంతో గూడూరు గ్రామ శివారు జానకిపురంలో విషాదం నెలకొంది. భార్యాభర్తల గొడవలు ఇద్దరు ఆడపిల్లల ప్రాణాలు తీశాయని గ్రామస్తులు వాపోయారు. తంసప్‌లో విషం కలిపి ఇద్దరు కుమార్తెలను చంపాలనుకున్న నిందితుడు శ్రీనును మొదటి కుమార్తె చనిపోయిన వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పాలకుర్తి ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. భార్యాభర్తల గొడవలతో ఎవరు పిల్లలకు విషం ఇవ్వకూడదని, ఇలాంటి ఘాతుకాలకు పాల్పడరాదని సూచించారు. పంతాలకు వెళితే పసి మొగ్గల ప్రాణాలు గాలిలో కలుస్తాయని తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ - నలుగురికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-పాలకుర్తి

మంచుప్పుల నుండి హనుమకొండకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఉదయం 5:30 గంటల సమయంలో లారీ వెనకవైపు ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులతో పాటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పాలకుర్తి మండలంలోని మంచుప్పులలో నైట్‌హాల్ట్ చేస్తుందని తెలిపారు. మంచుప్పుల నుండి ఉదయం 5 గంటలకు ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు గూడూరు వెళ్లేసరికి ఐదున్నర అయిందని తెలిపారు. గూడూరులో గల చింతల్ వద్ద బస్సులో ప్యాసింజర్ ఎక్కుచుండగా లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో, నిద్రపోతూ లారీని అతి వేగంగా నడుపుతూ ఆగి ఉన్నబస్సును లారీ ఒక్కసారిగా ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు సీట్ల మధ్య ఇరుక్కుపోయారని, బస్సును లారీ ఢీకొనడంతో 50 ఫీట్ల దూరంలో బస్సు ముందుకు దూసుకుపోయిందని తెలిపారు. లారీ డ్రైవర్ వెంటనే పరారయ్యాడని తెలిపారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకుర్తి ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. గాయాలైన ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని అన్నారు.





ముస్లీం పేదలకు రంజాన్ బట్టల పంపిణీ



నవతెలంగాణ-కొత్తగూడ

రంజాన్ పండుగను సోదరభావంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల మధ్య కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసిల్దార్ చందా నరేష్ అధ్యక్షతన సుమారు వందమంది ముస్లింనిరుపేద కుటుంబాలకు రంజాన్ బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ ప్రేమించే హృదయంలో భగవంతుడిని చూస్తూ, పరమత సహనం వహిస్తూ, ఇతరుల విశ్వాసాలను గౌరవిస్తూ, ఇరుగు పొరుగును గౌరవించడంలోనే సమాజ శాంతి దాగి ఉందన్నారు.సాగరమంత సహనంతో జీవిస్తేనే మానవ ప్రగతి, ప్రపంచశాంతి సాధ్యమన్నారు. ఎండలు విపరీతంగా ఉన్నందున అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలందరూ ఎండలో బయటకు వెళ్ళకూడదని, వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించి వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు 9 గంటల వరకు ఇంటికి చేరుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్,జెడ్పిటిసి పులుసం పుష్పలత, వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, సర్పంచ్ మల్లెల రణధీర్, గోవిందపురం సర్పంచ్ ఇరుప రాజేశ్వరరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి సయ్యద్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండిఅజ్మత్ పాష, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీస్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-కొత్తగూడ

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పోగుళ్లపల్లి చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డి ఒంటెద్దు పోకడ నచ్చక పార్టీలకతీతంగా ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిఎస్ఓకు డైరెక్టర్ల సంతకలతో కూడిన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. అవిశ్వాస తీర్మానం పత్రం ఇచ్చిన వారిలో డైరెక్టర్లు చల్లా నారాయణరెడ్డి, కొమ్మెనబోయిన వేణు, ఈసం కమలమ్మ స్వామి, మమత, వజ్జ జంపయ్య, సుంకరబోయిన మొగిలి, భూక్య సురేష్, లక్ష్మయ్య, దుర్గం సమ్మయ్య తదితరులు ఉన్నారు.

రజక వృత్తిదారులు ఉద్యమించాలి

రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

రజక వృత్తి దారులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిల్పూర్ మండలంలో ఆ సంఘం నాయకులతో కలిసి జిల్లా మహాసభల గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరజక వృత్తిదారుల సంఘం 23 సంవత్సరాలు పూర్తి చేసుకుని సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నదని, వృత్తిని కాపాడే క్రమంలో అనేక పోరాటాలు నిర్వహించిన రజక సోదరులు, పోరాటాల గడ్డ ఐలమ్మ స్ఫూర్తితో అనేక పోరాటాలు జరిపామని తెలిపారు. జిల్లా కేంద్రంలో రజక వృత్తి దారుల సమస్యల పరిష్కారానికి సంఘటితమై సంఘం రాష్ట్ర మూడవ మహాసభలను ఈనెల 29,30న జిల్లా కేంద్రంలో వైష్ణవి గార్డెన్ నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలకు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యామంకి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎదునూరి గట్టేశం, జిల్లా నాయకులు మేడిపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నపెండ్యాలలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అభయ హాస్పిటల్ వైద్యులు వైద్యం గౌతం అన్నారు. బుధవారం చిల్పూర్ మండలం చిన్న పెండ్యాల గ్రామంలో హన్మకొండకు చెందిన అభయ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరానికి గ్రామ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమా సమ్మయ్య ప్రారంబించారు.ఈసందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజలకు తమ వంతు వైద్య పరంగా సేవలు అందించాలని ఉద్దేశంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలే గాకుండా జనరల్ చెకప్ ఉచితంగా చేయబడునని జనరల్ సర్జరీకి సంబంధించి చికిత్సను ఉచితంగా చేస్తామన్నారు. గ్రామాల్లో నేటికీ సక్రమంగా వైద్యం అందక ఎంతోమంది వ్యాధిబారిన పడి ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఈలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాధి సంక్రమించిన తొలి రోజుల్లోనే వ్యాధిని గుర్తించాలని, అందుకు వైద్యుల సలహాలను, సూచనలను పాటించాలని కోరారు.డాక్టర్ వైష్ణవి మాట్లాడుతూ మహిళలకు వైద్య చికిత్స సకాలంలో అందక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినట్లయితే వెంటనే వైద్యులను ఆశ్రయించాలన్నారు. వైద్యశిబిరంలో తాము పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులను అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ లింగారెడ్డి మాట్లాడుతూ ప్రజలు వైద్యాన్ని అడగకముందే ఆసుపత్రి యాజమాన్యం తీరుపై అభినందించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటయ్య, జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి శేషు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్



నవతెలంగాణ-బచ్చన్నపేట

అక్రమంగా తరలిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు ఏసిపి దేవేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని విద్యార్థులకు, యువకులను డ్రగ్స్‌కు అలవాటు చేస్తూ విక్రయిస్తున్నారని తెలిపా రు. ఈ సందర్భంగా మండలంలోని మంత్రి శ్రీకాంత్ (22), గ్రామం చిన్నరాం చెర్ల, వేముల రవితేజ (21) కొన్నే బండకింది దిలీప్ (22) బసిరెడ్డిపల్లి, మహ మ్మద్ అజి (30) చిలకలగూడ సికింద్రాబాద్‌కు చెందిన యువకులను మండ లంలోని మొండికుంట వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వీరిపై అనుమానం రావడంతో ఎంక్వయిరీ చేయగా వీరి వద్ద రెండు కిలోల 14 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ 40 వేల రూపాయల వరకు ఉంటుందని వీటిని మండలంలోని వివిధ గ్రామాలలో 40 నుండి 50 గ్రాముల వరకు చిన్న చిన్న ప్యాకులుగా తయారుచేసి విక్రయిస్తున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి దేవేందర్‌రెడ్డి మండల ప్రజలు వేసవికాలం సందర్భంగా ఆరు బయట పడుకునే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటికి తాళం వేసి తాలా న్ని తమ దగ్గరనే ఉంచుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులకు వేసవి కావడంతో విద్యార్థులను ఈతకు వెళ్లేటప్పుడు వారికి తగు జాగ్రత్తలను తీసుకునే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఈముఠాను పట్టించిన అధికారులను రివార్డులతో సత్కరిస్తామన్నారు. అలాగే పోలీసు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ రాజు కానిస్టేబుల్ జమాలను ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీనివాస్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని సిరిపురం గ్రామంలో బీఆర్ఎస్ మాజీ గ్రామశాఖ ఉపాధ్యక్షులు కొరిపెల్లి శ్రీనివాస్ రెడ్డి మరణించారు.బుధవారం తెలంగాణ తొలి మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వారి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి లక్ష్మీ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజా ప్రతినిదులు, ముఖ్య నాయకులు, గ్రామస్తులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి



నవతెలంగాణ-గూడూరు

మండలంలోని జంగు తండా గ్రామపంచాయతీ ఏఆర్ తండా పరిధిలో నీటి తొట్టెలో పడి ఈసం రిశాంత్ పటేల్ సంవత్సరంన్నర బాబు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తండవాసులు తెలిపిన వివరాల ప్రకారం ఏఆర్ తండాకు చెందిన ఈసం వీరస్వామి-వినీత దంపతులకు కుమారుడు రిశాంత్ ఇంటి వద్ద ఆడుకుంటూ తొట్టిలో పడి మృతి చెందినట్లు తండవాసులు తెలిపారు. ఇంటి వద్ద ఉన్న బాలుడు కనబడకపోవడంతో తండ్రి వీరస్వామి నీటి తొట్టిలో చూడగా బాలుడు విగత జీవిగా కనిపించాడు. అప్పటి వరకు కండ్ల ముందు ఆడుకుంటూ ఉన్న బాలుడు మృతి చెందడంతో ఏఆర్ తండాలో విషాదఛాయలు అమలుకున్నాయి.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

తహసీల్దార్ రమేష్ బాబు



నవతెలంగాణ-పెద్దవంగర

ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న ప్రజలు జీవో 58, 59 కింద స్థలాల క్రమబద్ధీకరణకుమీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జూన్ 2, 2020 సంవత్సరంలోపు ఇళ్ల, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్న ప్రజలు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. గతంలో క్రమబద్ధీకరణ తిరస్కరణకు గురైన వారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. క్రమబద్ధీకరణ కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 125 గజాల లోపు స్థలం ఉన్న లబ్దిదారులకు జీఓ 58 ప్రకారం ఉచితమని, 125 కంటే ఎక్కువ స్థలం ఉంటే నామమాత్రపు రుసుముతో క్రమబద్ధీకరణ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తుతో పాటు ఇంటి పన్ను, కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ ఫోటో, ప్రాపర్టీ ఫోటో, మొబైల్ నంబర్, ప్రాపర్టీ హద్దుల జిరాక్స్ ప్రతులతో మీ సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కార్యకర్తలకు అండగా ప్రభుత్వం : ఎంపీపీ



నవతెలంగాణ-ఖానాపురం

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు అన్నారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించిన బిఆర్ఎస్ కార్యకర్త మచ్చిక సాంబలక్ష్మీ కుటుంబానికి రూ.2 లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత సంవత్సరం జూలై నెలలో ట్రైన్ ప్రమాదంలో గాయపడి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణిం చిన మచ్చిక సాంబలక్ష్మి కుటుంబానికి నర్సంపేట శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితో బిఆర్ఎస్ పార్టీ ద్వారా ప్రమాద బీమా రూ.2 లక్షల మంజూరు చేశారని తెలిపారు. పార్టీపరంగా కార్యకర్తల సంక్షేమ విషయంలో సభ్యత్వం తీసుకున్న వారూ ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఇన్సూరెన్స్ చెల్లించడంలో బిఆర్ఎస్ పార్టీ భారతదేశంలోనే ముందు వరుసలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నర్సయ్య,సొసైటీ వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ,రైతుబందు జిల్లా కమిటీ సభ్యులు బొప్పిడి పూర్ణచందర్ రావు,మండల పార్టీ ఉపాధ్యక్షుడు తక్కలపెల్లి రమేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసరి రమేష్,గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్,వార్డు సభ్యులు జటంగి నాగరాజు, మాజీ ఎంపిటిసి బోడ పూలు నాయక్,నాయకులు గంగాపురం రాజు,మర్రి రామస్వామి,వెంకట నారాయణ,పర్సూరి నరేంద్ర, యార్లగడ్డ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లీంలకు దావత్-ఏ-ఇఫ్తార్ విందు





నవతెలంగాణ-మట్టెవాడ

రాష్ట్రంలో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాసాలు ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వం దావత్ ఏ ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. ట్రిమ్స్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ ఈద్గాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మేయర్ గుండు సుధారాణి, ఎంపీ పసునూరి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కుడా చైర్మన్ సుందర రాజన్ యాదవులతో కలిసి విచ్చేసిన ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు వరంగల్ తూర్పులో ఇఫ్తార్ విందులను ఘనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్,కార్పొరేటర్లు పురన్, సిద్ధం రాజు, దిడ్డి కుమారస్వామి, చాంద్ పాషాఅహ్మద్,జ బ్బార్, అంజాద్, ఈద్గా కమిటీ సభ్యులు ముస్లింలు పాల్గొన్నారు.

కులం మతాలకతీతంగా పండుగలను జరుపుకోవాలి

ఆత్మకూర్ : అందరు కలిసిమెలిసి ఉండడమే కాకుండా కులం మతాలకు అతీతంగా పండుగలు జరుపుకున్నప్పుడు ఆనందంగా ఉంటుందని రాష్ట్ర సర్పంచ్ ఫోరం నాయకులు పర్వతగిరి రాజు అన్నారు.బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలు చేసిన అనంతరం రాష్ట్ర సర్పంచ్ ఫోరం నాయకులు పర్వతగిరి రాజు అందరికి ఇఫ్తార్ విందును అందించారు. పర్వతగిరి రాజు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరు కలిసి పండుగలను నిర్వహించుకుంటేనే సంతోష కరంగా ఉంటుందని అన్నారు. ఈ విందులో పాక్స్ చైర్మన్ ఏరుగొండ రవీందర్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు,నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బయ్య తిరుపతి,జిల్లా నాయకులు తనుగుల సందీప్,అలువాల రవి,బయ్యా కుమారస్వామి,బారు బరుపట్ల కిరీటి,అయోధ్య, జయపాల్ రెడ్డి, ప్రసాద్, మొహమ్మద్‌ఖాజా,అంజలి రమేష్,కరీం పాల్గొన్నారు..

గూడెప్పాడ్ లో ఇఫ్తార్ విందు

రంజాన్ పర్వదిన పురస్కరించుకొని గూడెప్పాడ్ మసీదులో అందరితో కలిసి బిఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు మొహమ్మద్ బాబు మియా (చిరంజీవి) ప్రార్ధనలు చేసిన అనంతరం అందరితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అందరు కలిసి పండుగలు ఆచరించుకున్నప్పుడే సంతోషంగా ఉంటుందని అన్నారు.

సర్పంచ్ మోహన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-వేలేరు

మండలంలోని శాలపల్లి గ్రామ సర్పంచ్ మోహన్ తల్లి గుగులోతూ పున్నీ మృతిచెందగా విషయం తెలిసిన ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య బుధవారం మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

నవతెలంగాణ-పర్వతగిరి



మండల పరిధిలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో గత 10రోజుల నుంచి కోతలు మొదలు పెట్టినప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను ఏదో వైపు మళ్లిస్తూ మోసం చేయడానికి సీఎంకేసీఆర్ ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించి వారం రోజులైనా ఇప్పటివరకు దిక్కులేదని ఎద్దేవా చేశారు.

అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో శ్రద్ధ లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పటికైనా రైతుల క్షేమం కోసం ఒకటి రెండు రోజులలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు మొక్కజొన్న కొనుగోలు చేయాలని కిసాన్ కాంగ్రెస్ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

చేనేతలను ఆదుకున్న ప్రభుత్వం : వొడితెల



నవతెలంగాణ-ఎల్కతుర్తి

చేనేతలకు లక్ష రూపాయల రుణం మాఫీ చేసి కార్మికులను ఆదుకున్నామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సూరారంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న చేనేత భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ సబ్‌సెంటర్‌ను ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం పేదలకు అండగా కళ్యాణ లక్ష్మి పథకం అని తెలిపారు. గ్రామగ్రామాన ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు రూ.37,04,292ల విలువగల కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పంపిణీ చేశారు. ఇప్పటి వరకు ఎల్కతుర్తి మండలంలో 1524 కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.13,76,43,860లు విలువగల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై వందమంది యువకులు బీజేపీ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారిని ఎమ్మెల్యే సతీష్ కుమార్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్‌ఎంపీపీ తంగడ నాగేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోడిశాల సమ్మయ్య గౌడ్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, చైర్మన్ శేషగిరి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూరుగుల రామారావు, సూరారం సర్పంచ్ కుర్ర సాంబమూర్తి, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, తహశీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో తూర్పా టి సునీత, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పద్మశాలీలు ఐక్యతను చాటుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

పద్మశాలి కులస్తులందరూ ఏకతాటిపై నిలిచి తమ ఐక్యతను చాటుకోవాలని పద్మశాలీ మండల అడహాక్ కమిటీ కన్వీనర్ వావిలాల వేణుగోపాల ప్రసాద్ అన్నారు. మండలంలోని ఐదు గ్రామాల్లో బుధవారం పద్మశాలి గ్రామ కమిటీలను అడహక్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కొప్పుల, గట్లకానిపర్తి, జోగంపల్లి, గోవిందాపూర్, నరసింహులపల్లె గ్రామ కమిటీ అధ్యక్షులుగా సామల విజయ్, కుసుమ మురళి, పసునూటి భానుప్రకాష్, దాసి శ్రావణ్, గడ్డం రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన గ్రామాలలో అతి త్వరలో గ్రామ కమిటీలను పూర్తి చేస్తామని కన్వీనర్ వేణుగోపాల ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ కందకట్ల ప్రకాష్, సభ్యులు సామల మధుసూదన్, బాసాని లక్ష్మీనారాయణ, సామల బిక్షపతి, గుర్రం అశోక్, పల్నాటి జలంధర్, అల్లే రాజీరు, బూర పైడి, రమేష్ పాల్గొన్నారు.

బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-ఎల్కతుర్తి

బాలవికాస స్వచ్ఛంద సంస్థ సేవా ఆధ్వర్యంలో, కీర్తిశేషులు బూస్సారి చిరం జీవి జ్ఞాపకార్థం, అతని భార్య లావణ్య దాతగా, చలివేంద్రాన్ని సర్పంచ్ కుడితాడి అనితరాజు, ఎంపీటీసీ బొంకురి రజిత రవీందర్లు, ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో బాలవికాస ప్రతినిధి రమ, మాజీ సర్పంచ్ ఇంగే రాజేశ్వరరావు మహిళా నాయకురాలు దాసరి విజయ, ఎండి అమీనా, అమృతమ్మలావణ్య, బుసరి శివశంకర్, శివాజీ, అంబీర్ శ్రీనివాస్, దాసరి ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా కపివర్ధన్

నవతెలంగాణ-ఎల్కతుర్తి

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షునిగా కపి వర్ధన్ ను, నియమిస్తూ జాతీయ బి సి సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు అర్. కష్ణయ్యా ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా బిసిల రాజ్యాధికార సాధన కు ఐక్యత సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని ఆయన సూచించారు. తమ తమ నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కోఆరినేటర్ జక్కని సంతోష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన బోర్లకు భూమి పూజ

నవతెలంగాణ-ఖానాపురం

మండల కేంద్రంలోని ధర్మ రావు పేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం,శివాలయం,శ్రీ పగడాల వెంకటేశ్వరస్వామి దేవస్థానల్లో నూతనంగా బోర్లు వేయుటకు ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు భూమి పూజ కార్య క్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్ను శతి-పూర్ణచందర్, దేవాలయ కమిటీ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వ రరావు, పల్లెపాటి సంపత్ రావు, అడ్డూరి మోహన్రావు, కత్తాలసంపత్ రావు, జింకల అశోక్, మాధవరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని కోమటిపల్లి రైల్వే గేట్ ను మరమ్మత్తుల కారణంగా 21 నుండి 27 వరకు వారం రోజులపాటు గేటును మూసి వేయడం జరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేటు మీదుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని తెలిపారు. వారంరోజులపాటు జరిగే పనులకు ప్రజలు వాహనదారులు సహకరించాలని కోరారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ

శాయంపేట : పత్తిపాక గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ అధ్యక్షునిగా కొంగర విజయ్, ప్రధాన కార్యదర్శిగా నాలీకే శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కొంగర వినీత్, మగ్గం సుమన్, సహాయ కార్యదర్శులుగా నాగుల ప్రశాంత్, కొంగర అంబేద్కర్, కోశాధికారిగా ఒంటేరు మనోహ ర్, క్రీడ సెక్రటరీగా కూనమల్ల వినయ్, నాలుక నాగరాజు ఎన్నికయ్యారు.

కిట్స్‌లో ముగిసిన 34వ వార్షిక క్రీడోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హసన్‌పర్తి



మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 34వ వార్షిక క్రీడోత్సవ వేడుకలు విజయ వంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా క్రీడాపోటీల్లో అత్యంత ప్రతిభకనబర్చి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఏకలవ్య అవార్డు గ్రహిత, అంతర్జాతీయ క్రీడాకారిణి పూనమ్ బెల్లియప్ప, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంత రావు చేతుల మీదుగా బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సంద్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన పూనమ్ బెల్లియప్ప, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని వాటినిస్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగితేనే జీవితంలో అనుకున్నది సాధించవచ్చన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటముల పట్ల సమదృష్టి కలిగి ఉండాలన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని, శారీరక దృఢత్వాన్ని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ 2022-2023 విద్యా సంవత్సరంలో 40కి పైగా క్రీడలు, ఆటలు నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో విజేతలకు మొత్తం 12 ట్రోఫీలు, 561 పతకాలు, అధ్యాపకులకు వివిధ క్రీడా కార్యక్రమాల విజేతలకు 84పతకాలు ప్రదానం చేసినట్లు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ చదువులోనేకాకుండా క్రీడలు, ఆటల్లో కూడా బెంచ్‌మార్క్‌లు సష్టిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి, కోశాధికారి పి.నారాయణరెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు ఇ.రాంరెడ్డి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

వర్ధన్నపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అడప సురేందర్

నవతెలంగాణ-వర్ధన్నపేట



ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులచే ఇంగ్లీష్ మీడియం విద్యను అందించడం జరుగుతుందని కావున తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అడప సురేందర్ కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని గడ్డ లో ఉపాధ్యాయుల బందం విద్యార్థులతో కలిసి ఇంటింటికి తిరిగి పిల్లలను పాఠశాల చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ ఉచిత నాణ్యమైన విద్య బోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా రెండు చేతుల యూనిఫామ్ లు, పాఠ్యపుస్తకములు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసం శారీరక దఢత్వం కల్పించేందుకు గేమ్స్ , కరాటే, కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ విద్య మోజులో పడి లక్షల రూపాయలు వధా చేసుకోవద్దని ఆయన సూచించారు. విద్యార్థులు భవిష్యత్తు దష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు లింగమూర్తి, మదన్ మోహన్, పిఈటి శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేసిన బీఎస్‌పీ నాయకులు



నవతెలంగాణ-గార్ల

మండలంలోని పెద్ద కిష్టాపురం గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఆత్మహత్య చేసకొని మరణించిన యువకుడు హలావత్ మంగిలాల్ కుటుంబాన్ని బుధవారం బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న పరామర్శించి 25 కేజీల బియ్యాన్ని వితరణగా చేశారు. మృతిడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు సంతోష్, జీవన్, బాల కుమార్, చరణ్, వెంకీ, రాములు, మోహన్ పాల్గొన్నారు.

నెహ్రూ దాతృత్వం అభినందనీయం : సర్పంచ్



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

గుగులోతు నెహ్రు సునీతల దాతృత్వం అభినందనీయమని కొమ్మనపల్లి సర్పంచ్ పాడ్య రమేష్ సెక్రటరీ లెనిన్ అన్నారు. గ్రామంలో అంగన్వాడీ పాఠశాలకు భవనం మంజూరు కాగా స్థలం కొరకు సర్పంచ్ సంప్రదించగా గతంలో నెహ్రూ తల్లిదండ్రులు గుగులోతు కమలమ్మ-రాములు దంపతులు ఇచ్చిన మాట మేరకు కమలమ్మ జ్ఞాపకార్థం గుంట భూమిని సర్వే నెంబర్ 12లో ఇచ్చానని, భూమి దాన పత్రాన్ని సర్పంచ్ రమేష్ సెక్రటరీ లెనిన్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయిపెల్లి యాకయ్య, ఉపసర్పంచ్ మంగ్యా నాయక్, బాసునాయక్, మోహన్, కారొబార్ భీకు, సురేందర్, వీరు, లక్క పాల్గొన్నారు.



సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

విద్యుత్, త్రాగునీటి సమస్యలపై నిలదీసిన ఎంపీటీసీ

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ పథకం అద్భుతంగా ఉన్నదని, ఎక్కడా కూడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నీటిఎద్దడిని నివారించాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, ఎంపిపి కందుల రేఖ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజలకోసం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న గొప్ప మనసున్న మారాజు కేసీఆర్ అన్నారు. వరుసగా అన్నీ శాఖలపై చర్చ కొనసాగింది. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కొందరూ ముఖ్య శాఖల అధికారులు సైతం గైర్హాజయ్యారు. సమావేశంలో భాగంగా వైస్ ఎంపిపి చల్లా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని నివారించేందుకు అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరగా పశు వైద్యాధికారి బి.మౌనిక సమాధానమిచ్చారు. స్థానిక మోడల్ కాలనీలో గత కొన్ని రోజులుగా త్రాగునీటి సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపిటిసి గన్ను నర్సింహులు తెలుపగా త్వరిగతిన పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్డబ్ల్యుఎస్ అధికారులు చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు విపరీతంగా పెరిగి, కుటుంబ యజమానులు మద్యానికి బానిసై, పచ్చని జీవితాలు గొడవలతో చిన్నాభిన్నం అవుతున్నాయని, కో ఆప్షన్ సభ్యులు మైబు పాషా సభలో ప్రస్తావిస్తూ నోటీసులు ఇచ్చి ఎక్సైజ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. వెంటనే స్పందించి సీఐ భాస్కర్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శివునిపల్లిలో 13బి గతంలో నిరుపేదలకు కేటాయించారని, అందులో కొన్ని కారణాలతో అలాగే ఉండిపోయిందని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సహకరిస్తే రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ అందించనున్న 3లక్షల ఇంటి నిర్మాణంలో తోడ్పడిన వారవుతారని ఎంపిటిసి గుర్రం రాజు తెలుపగా, డిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు జనవాసాల మధ్య ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లను త్వరగా తొలగించాలని, లేని పక్షంలో ప్రజల నుంచి సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఎస్సీ గృహాలకు వంద యూనిట్లు వాడితే ప్రభుత్వం ఉచితంగా కరెంట్ అందిస్తున్నారని విషయం ప్రజల్లో అవగాహన తేవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా ఊర్లనే ఏడిపించింది : ఎస్సై శ్రీకాంత్



నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కళ్ళకు కట్టినట్టుగా ప్రదర్శించబడుతున్న బలగం సినిమా ఊర్లోనే ఏడిపిస్తున్నాయని, బంధాలు బంధుత్వాలకు బలగం సినిమా రూపొందించడం అభినందనీయమని పాలకుర్తి ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం రాత్రి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ తన సొంత ఖర్చులతో మండల కేంద్రంలో గల గుడివాడచౌరస్తాలో చిత్రాన్ని ప్రదర్శించగా, మండలంలోని శాతాపురంలో మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ సహకారంతో బలగం సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాలకుర్తి, శాతాపురం గ్రామాల సర్పంచులు వీరమనేని యాకాంతరావు, పసులాది సుశీల వెంకటేష్, మహాత్మా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సింగారపు దీపక్, జిలుకర తిరుమలతో కలిసి ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ విడిపోయిన రక్తసంబంధీకులు బలగం సినిమా ద్వారా చూసి ఏకమయ్యారని తెలిపారు. తెలంగాణలో బలగం మూవీకి ఆదర అభిమానాలు లభించాయని, ఈర్ష రాఘవేద్వేషాలు లేకుండా ఉండేందుకు బలగం సినిమా ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. విడిపోతే జగడం, కలిసి ఉంటే బలగమని, బంధాలు బంధుత్వాలు ఉండేలా ప్రతి ఒక్కరూ బలగం సినిమా ద్వారా నిరూపించుకోవాలని సూచించారు. తగాదాలకు స్వస్తి పలకాలని అన్నారు. సినిమా సన్నివేశాలను చూసిన గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి మదర్, ఎంపీటీసీ ఎడవెల్లి పురుషోత్తం, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి సర్వర్ ఖాన్, ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మారుజోడు సంతోష్, గుగులోత్ దేవోజి, సలేంద్ర సోమన్న, చిదురాల ఎల్లయ్య, చారగొండ్ల శివ గ్రామస్తులు పాల్గొన్నారు.

పీవైఎల్ అధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ-గార్ల

ఈ నెల 21, 22వ తేదీలలో మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో 6 మండలాల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను పివైఎల్ అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పివైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వాంకుడోత్ జగన్,బానోత్ మంగిలాల్‌లు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గార్ల, బయ్యారం, ఇల్లందు, గంగారం, కొత్తగూడ, గూడూరు మండలాలకు చెందిన ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను నమోదు చేసుకొని క్రీడాపోటీలను జయప్రదం చేయాలని కోరారు. ఈ క్రీడల పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీల నమోదు కొరకు గార్ల మండలానికి చెందిన బానోత్ మంగీలాల్ సెల్ 7995255892ను, మిగతా మండలాలకు చెందిన క్రీడాకారులు అయా మండలానికి చెందిన పివైఎల్ మండల కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



నవతెలంగాణ-లింగాలఘనపురం

స్టేషన్‌గనప్పూర్ చింతగుంట్ల నరేందర్ రెడ్డి నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఉపముఖ్యమంత్రి వర్యులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బుధవారం పంపిణీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా లింగాలగణపురం మండలం కుందారం గ్రామానికి కాజరాజు గీతా ప్రసాద్ సిఎం రిలీఫ్ చెక్కును యొక్క వారి కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల చెక్కును కడియం శ్రీహరి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంగ నాగరాజు, దూసరి సోమనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరన్న

నవతెలంగాణ- దంతాలపల్లి



మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన అనపర్తి వీరన్న జాతీయ మాల మహానాడు మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు స్టేట్ ప్రెసిడెంట్ పిల్లి సుధాకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. తనకు ఈ పదవిని అప్పగించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

అర్హులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలి

సీపీఐ (ఎంఎల్) సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ఇల్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీఅమలుకై ఏప్రిల్ 20న మండల కేంద్రాలలో ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం మండలంలోని అమ్మాపురంలో ఇల్లులేని నిరుపేదల సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాపురం గ్రామంలో బుడగజంగాలు సుమారు 160 మంది ఇల్లు లేక పాలిథిన్ కవర్లు కప్పుకొని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు కనిపించడం లేదా అని అన్నారు. ఇలా అనేక గ్రామాలలో వేల కుటుంబాలు జీవిస్తున్నాయని ఆవేదన చెందారు. 9 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ పాలనలో కంటి తుడుపు చర్యగా అక్కడక్కడ ఇండ్ల నిర్మాణం చేసి అవి పేదలకు అప్పజెప్పకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.ప్రకటించిన డబల్ డబల్ బెడ్ రూములను ఇంకా ఎప్పుడు పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు.ఎన్నికల ఎత్తుగడలో భాగంగా సొంత స్థలం ఉన్న వారికి మూడు లక్షలు ఇస్తామని హామీ ప్రకటనలు తప్ప నిర్దిష్ట విధివిధానాలను ప్రకటించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అవకాశవాదానికి అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే మూడు లక్షలు సరిపోవని ఐదు లక్షలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం మరో ఐదు లక్షలు ఇచ్చి పక్కాఇళ్ల నిర్మాణానికి అర్హులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.రేషన్ కార్డు కావాలని లక్షల మంది దరఖాస్తులు చేసుకొని సంవత్సరాలు గడిచిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగుల, ఒంటరి మహిళ పెన్షన్స్ కొత్తవి వెంటనే ఇవ్వాలని అన్నారు. మాటలతో కాకుండా చేతల్లో నిరూపించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 20న మండల కేంద్రాలలో, 24న జిల్లా కేంద్రంలో జరుగు ఆందోళన కార్యక్రమంలో ఇల్లు లేని పేదలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రమంతా జరుగుతున్న ఈ ఆందోళనలతో ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా తొర్రూర్ సంయుక్త మండలాల కార్యదర్శి చింతా నవీన్, మండల నాయకులు అజ్మీర దేవేందర్, ఎస్కే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ : మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

మత విద్వేషాలను బీజేపీ పార్టీ రెచ్చగొడుతున్నదని రాష్ట్ర సీఎం కేసీఆర్ అన్ని మతాలను గౌరవిస్తూ ప్రభుత్వమే ప్రజల పండుగలను నిర్వహించే గొప్ప సంస్కృతికి మొదలు పెట్టారని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బీజేపీ మత విద్వేషాలు పెంచే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో హిందూ ముస్లిం ప్రజలు కలిసి మెలసి ఉంటున్నారు. సర్వ మత సామరస్యాన్ని తెలంగాణ చాటింది. సీఎం కెసిఆర్ అందరినీ, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దెట్టువ ప్రార్ధనలు శాంతి, సామరస్యానికి వేధికలు కావాలన్నారు. ముస్లింల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. అలాగే ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి 2008 నుండి 2014 మధ్యకాలంలో 812 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, గత ఎనిమిదేళ్ళ కాలంలో తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రంజాన్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తూ ప్రతి ఏటా రాష్ట్రంలోని దాదాపు ఐదులక్షల మంది ముస్లింలకు దుస్తులను, రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదింటి ముస్లిం మహిళల వివాహం కోసం రాష్ట్ర ప్రభుత్వం 1 లక్ష 116 రూపాయల సహాయం షాదీ ముబారక్ పథకం ద్వారా అందజేస్తున్నదని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ప్రమాణాలతో ఇస్లామిక్ సెంటర్ కమ్ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి కోకాపేటలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి 40 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, మసీదులలో ప్రార్ధనలు చేసే 10 వేల మంది ఇమామ్‌లకు ప్రతినెలా 5 వేల రూపాయల భృతి అందించబడుతున్నదని అన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం 25 కోట్ల రూపాయల భృతిగా చెల్లించిందని మంత్రి తెలిపారు. తెలంగాణ వర్ఫ్ బోర్డు సంస్థలో నిర్మాణాలు, మరమ్మతుల కోసం 53 కోట్ల రూపాయల గ్రాంటును ప్రభుత్వం అందించిందని ఎర్రబెల్లి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఏర్పాటు చేయడమే కాకుండా ఉర్దూ అకాడమీ నిర్వహణకు 40 కోట్ల రూపాయలను కేటాయించినట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పి ఫ్లోర్ మంగళపల శ్రీనివాస్ ముస్లిం పెద్దలు, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయండి

మంత్రి దయాకర్ రావుకు వినతి



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయాలని, క్యాస్ట్ సర్టిఫికెట్ నిబంధన ఎత్తివేయాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ కోరారు. బుధవారం తొర్రూరు మండల కేంద్రంలో రామ ఉపేందర్ గార్డెన్లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావుకు జీఎంపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం అశోక్ మాట్లాడుతూ, ఎన్నో ఉద్యమాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించడానికి సన్నాహాలు చేయడం అభినందనీయం అన్నారు. జిల్లాలో గొల్ల కురుమల అభివృద్ధికి ఆర్థికంగా ఉపయోగపడాలని ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 11866 మందికి మొదటి విడతలో గొర్రెలు పంపిణీ చేశారు. రెండో విడతల సుమారు 11888 మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఇచ్చిన యూనిట్లలో అనేక అక్రమాలు జరిగి మధ్య దళారులు కొంతమంది పశువైద్యాధికారులు లాభపడ్డారు. ఈసారి దళారుల ప్రమేయం లేకుండా, అక్రమాలకుతావు లేకుండా, లబ్దిదారులకు నగదు బదిలీ ప్రవేశపెట్టి గొల్ల కురుమలకు నచ్చిన గొర్రెలు, ఇష్టమొచ్చిన చోట కొనుగోలు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా పైలెట్ ప్రాజెక్టు కిందఅక్కడ గొల్ల కురుమలకు అకౌంట్లలోకి నగదు బదిలీ చేశారని వారు గుర్తుకు చేశారు. అలాగే కింది స్థాయి అధికారులు సొసైటీ సభ్యులందరినీ కుల ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారని తెలిపారు. దీనివల్ల పథకం అమలుకు మరింత జాప్యం అయ్యే అవకాశం ఉందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు తహసిల్దార్ నుండి కాకుండా గతంలో గ్రామ సొసైటీ అధ్యక్షుల సంతకాలతో తీసుకోవాలని కోరుతున్నాం. పశువైద్యాధికారులు లేకుండా, ఇతర శాఖ అధికారులచే పథకం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. దీనివల్ల గొర్రెల ఆరోగ్య, వయసు, మేలురకామా కాదా,అనేది తెలుసుకోవడం ఇబ్బంది అవుతుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి తప్ప పశువైద్యాధికారులు మొత్తమే కొనుగోలు కమిటీలో లేకపోవడం సరైనది కాదన్నారు. మంత్రి స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవినీతి అక్రమాలు జరగకుండా పంపిణీ జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మురళి, మడూరు గ్రామ సొసైటీ అధ్యక్షులు మంచే బచ్చయ్య, శంకరయ్య, బత్తుల కుమార్, ఎర్రం రాజు వెంకన్న పాల్గొన్నారు.

అధికార యావతో రాష్ట్రాభివృద్ధికి బీజేపీ అడ్డుకాలు

79 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ - మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ఆకలి బాధలు తీర్చి, భవిష్యత్తుకు బాటలు వేసి, ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించిన మహనుభావుడు, రాజ్యాంగ నిర్మాతడా.బీఆర్ అంబేద్కర్ అని, అయన విగ్రహ ఏర్పాటుపై విమర్శలు చేసే బీజేపి, ప్రధాని మోడీ, అంబేద్కర్‌పై నిజంగా ప్రేముంటే, రాజకీయాలకు మాత్రమే వాడుకోకుండా కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి డా. బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. బుధవారం అంబేద్కర్ 125 అడుగుల ఎత్తు విగ్రహావిష్కరణకు కృతజ్ఞతగా నియోజక వర్గ కేంద్రంలో సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి నివాసంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదే వెంకన్న అధ్యక్షతన సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి, మునుపెన్నడూ లేనివిధంగా మెడికల్ కాలేజీఏర్పాటు చేశారని, జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి కేంద్రం నుంచి అనుమతి లభించిందని, ఉమ్మడి జిల్లాలో మహబూబాబాద్‌లో ప్రస్తుతం తరగతులు జరుగుతున్నవని, వచ్చే ఏడాదిలో మన జిల్లాలో కూడా మెడికల్ తరగతులు ప్రారంభమవుతాయని, అనుబంధంగా టీచింగ్ హాస్పిటల్స్ ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు మరింతగా అందుబాటులో వస్తాయని అన్నారు.సీఎం కేసీఆర్ ఈనెల14న హైద్రాబాద్ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తుగల కాంస్య విగ్రహాన్ని, రూ. 145కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారని, దేశంలో ఎక్కడా లేని అతిపెద్ద విగ్రహమేకాక మ్యూజియం, గ్రంథాలయం, అంబేద్కర్ చిత్రాలను ప్రదర్శించే భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 2016 ఏప్రిల్ 14న తాను ఉపముఖ్యమంత్రి ఉన్నప్పుడు శంకుస్థాపన చేసి ప్రతిష్టాపన కమిటీ చైర్మన్‌గా తనను నియమించారని, నాడు చైనాకి కమిటీ సభ్యులతో వెళ్లి అంబేద్కర్ విగ్రహం రూపకల్పన నివేదిక ఆధారంగా గొప్పగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు జరిగిందని అన్నారు. దేశంలో రాజ్యాంగం లేకపోతే అసమానతల తొలగింపు, సమసమాజం నిర్మాణానికి రాయితీలు, రిజర్వేషన్లు కల్పించకపోతే దళితులు ఎక్కడ ఉండేవారు ఊహకే భయంకరంగా ఉండేదని వివరించారు. తెలంగాణ ఏర్పడిందంటే కేవలం ఉద్యమమొక్కటే కారణం కాదని, అంబేద్కర్ రచించిన ఆర్టికల్ 3 ఆధారపడి తెలంగాణ వచ్చిందని సీఎం కేసీఆర్ అంటుంటారని గుర్తు చేశారు. నూతన సెక్రటేరియట్‌కు అంబేద్కర్ నామకరణం పెట్టే సాహసోపేతమైన నిర్ణయానికి గర్వకారణమని భావిస్తూ అది కేసిఆర్‌కు మాత్రమే సాధ్యపడుతుందన్నారు. అనేక పథకాలు వచ్చినాయి..లబ్ది పొందలేక పోయామని, కారణమేదైనా ఆశించిన ఫలితాలు రాలేకపోయినా, దళిత బంధు ద్వారా ఆమార్పు రావాలన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేకంగా లక్షల కోట్లు వెచ్చించి, సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కి దక్కుతుందన్నారు. ఇంతటి అభివృద్ధిని ఓర్వలేక బీజెపి, కాంగ్రెస్ పార్టీలు కేవలం అధికారయావతో, అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం లేదని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా, సంక్షేమంలో దూసుకు పోతున్న రాష్ట్రాన్ని అడుగడుగునా అడ్డుకుంటున్నారని ప్రజలు గమనించాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 79మంది లబ్ధిదారులకు 33లక్షల విలువైన చెక్కులను అందించారు. ప్రతి నెల రెండు పర్యాయాలు 150 మందికి తగ్గకుండా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నానని, రాజకీయ జన్మనిచ్చిన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు ఎల్లవేళలా ఋణస్తుడనని అన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ తీగల కర్ణాకర్ రావు, సీనియర్ నాయకులు రాపోలు మధుసూదన్, బూర్ల శంకర్, నాగరబోయిన యాదగిరి, రాజేష్ నాయక్, చిల్పూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, కొంగరి రవి, తోకల దివాకర్ రెడ్డి, ఎంపిటిసిలు వెంకటస్వామి, రజాక్ యాదవ్, తాళ్ళపల్లి వెంకటయ్య, సమ్మయ్య మాజీ ఎంపిటిసి గుర్రం ఫాతి కుమార్, దశరథ, గడ్డమీద కిరణ్, కడియం యువసేన నాయకులు ఎల్మకంటి నాగరాజు, జీడి ప్రసాద్, పొన్న రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండు శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ బులియన్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన గుండు శ్రీనివాస్‌ను మిత్రులు, పద్మశాలీ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 23వ డివిజన్ మార్కండేయ కాలనీ అధ్యక్షుడు బూర రమేష్, పద్మశాలీ జిల్లా నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, చేనేత జేఏసీ నాయకులు కటకం విజయ్‌కుమార్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-లింగాలగణపురం

మండలంలోని వడ్డిచర్లలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ గ్రామ అధ్యక్షుడిగా చిటుకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గండి ఆంజనేయులు ఆర్ఎంపిని బుధవారం ఎన్నుకోవడం జరిగింది. గ్రామంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణం ప్రతిష్ట కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా గుగ్గిళ్ళ శ్రీకాంత్, రేగు శీను, సహాయ కార్యదర్శులుగా గండి ప్రవీణ్, దయ్యాల గణేష్, కోశాధికారిగా గండి నరేష్, సహాయ కోశాధికారిగా గండి శ్రీనివాస్, ఓయూ కార్యవర్గ సభ్యులుగా కానుగంటి రవి, శీను, నరేష్, గౌరవాధ్యక్షులుగా గండి మంగమ్మ, యాదగిరి, కడారి కృష్ణ, సలహాదారులుగా రేగు యాదగిరి, గండి శ్రీనివాస్, జోగు పరశురాములులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

రేవంత్ రెడ్డిని కలిసిన పాలకుర్తి కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-పాలకుర్తి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీకి ఇన్చార్జిని నియమించండని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డిని పాలకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులో గల రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను కలిశారు. 2018 ఎన్నికల అనంతరం పాలకుర్తి నియోజకవర్గాన్ని పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి పాలకుర్తి నియోజకవర్గంలో ఇంచార్జి లేకపోవడంతో కార్యకర్తలు అనేక ఇబ్బందులుపడుతూ అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట నివారణ చర్యలు చేపట్టి ఇప్పటికైనా పాలకుర్తి నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుండి ఇంచార్జిని ప్రకటించాలని రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మాజీ ఎంపీపీ గడ్డం యాక సోమయ్య, తొర్రూర్ సొసైటీ మాజీ చైర్మన్ కూస భాస్కర్ రెడ్డి,నాయకులు కోడూరు మురళీధర్ రెడ్డి, కమ్మగాని నాగన్న, పులి గణేష్, అల్లం ప్రదీప్ రెడ్డి,రామచంద్రంలతో పాటు 50 మంది నాయకులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకన్న



నవతెలంగాణ-పాలకుర్తి

దళిత బంధు లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకన్న సూచించారు. జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య ఆదేశాల మేరకు మండలంలోని తీగారంలో బుధవారం రైతుబంధులో లబ్ధి పొందిన వాహనాలను దుకాణాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ దళితుల ఆర్థిక అభివృద్ధికి రైతుబంధు ఎంతో దోహదపడుతుందన్నారు. దళితబంధులో దళితులందరినీ ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దళితబంధులో కొనుగోలు చేసిన వాహనాలతో పాటు ఇతర వ్యాపారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళితబంధులో లబ్ధి పొందిన లబ్దిదారులు ఆర్థికంగా ఎదిగినప్పుడే దళిత బంధుకు సార్ధకత ఉంటుందన్నారు. జిల్లాలో మొదటి విడుదల దళితబంధు పథకాన్ని 185 మందికి అందించామని తెలిపారు. ఒక్కో యూనిట్కు రూపాయలు 10 లక్షలు అందజేశామని, వాటిని పారదర్శకంగా వాడుకునేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,జనగామ,స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు పథకంలో కొనుగోలు చేసిన వాహనాలతో దళితులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీ నాయక్ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నెల్లికుదురు

సీనియర్ జర్నలిస్టు పంజాల వాసుదేవ్ అనారోగ్యంతో బాధపడుతుంటే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ మురళి నాయక్ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. మండలంలోని చిరునాగారం గ్రామంలో తన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకొని తన హాస్పటల్లో సంబంధించిన ట్రీట్మెంట్‌కు తన వంతు సహకారం అందిస్తానని బుధవారం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు యాదవ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ మండలంలోని నైనాల గ్రామం ఆకుల ఉప్పలయ్య మృతి చెందగా వారి కుటుంబానికి సందర్శించి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ గ్రామాలలో మీరు కొంతమంది కుటుంబాలకు వారి శక్తి సామర్థ్యాలుగా మించి పేద ప్రజలకు వారు అండగా నిలుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు ఎదల యాదవ రెడ్డి మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ గౌడ్, బైరు వెంకటయ్య గౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్ గౌడ్, శ్రీ కంఠమహేశ్వర సహకార సంఘం చైర్మన్ కొయ్యడి యా కాంతం గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ చారి, గౌడ సంఘం అధ్యక్షులు బైరు రాజేష్ గౌడ్, నవీన్ రెడ్డి, పృథ్వీరాజ్ గౌడ్, పెద్ద గోని వెంకన్న, హరికృష్ణ, బింగి యాకన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా దత్తత ఇచ్చిన దంపతుల పై కేసు నమోదు

నవతెలంగాణ-గార్ల

మండలంలోని ఇందిరానగర్‌కు చెందినమాలోత్ వెంకటేష్-ఉమ దంపతులకు మూడవ సంతానంగా జన్మించిన ఆడపిల్లను అక్రమంగా దత్తత ఇచ్చినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.వెంకటేష్-ఉమ దంపతులకు జన్మించిన ఆడపిల్లను వారి దగ్గర బంధువులైన బయ్యారం మండలానికి చెందిన కొమ్మురాజుల నాగరాజు-స్వప్న దంపతులకు ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా దత్తత ఇచ్చినట్లు ఐసిడిఎస్ సూపర్ వైజర్ శారద పోలీసు స్టేషనులో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు గార్ల ఎస్సై వెంకన్న తెలిపారు.

కూతురు మృతిని తట్టుకోలేక తండ్రి మృతి

కుటుంబానికి అండగా ఉంటా : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ-పెద్దవంగర

కూతురు మరణాన్ని తట్టుకోలేక ఓ తండ్రి గుండె ఆగింది. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నిమ్మల బుచ్చిరాములు-మాధవి దంపతులకు కూతురు సంధ్య, కుమారుడు సంతోష్ ఉన్నారు. సంధ్యను మూడేళ్ల క్రితం ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం, బంధంపల్లికి చెందిన నన్నెబోయిన ప్రవీణ్ కిచ్చి పెళ్లి చేశారు. ఇటీవల సంధ్య ఓ పాపకు జన్మనిచ్చింది. పాప పుట్టిన 12 రోజులకు సంధ్య గుండె పోటుతో మృతి చెందింది. కూతురిపై అంతులేని ప్రేమను పెంచుకున్న తండ్రి బుచ్చిరాములు (43) కూతురు మృతిని జీర్ణించుకోలేకపోయాడు. కూతురు మృతి చెందిన 12 రోజులకు తండ్రి గుండె ఆగిపోయింది. ఒకే కుటుంబానికి చెందిన కూతురు, తండ్రి స్వల్ప వ్యవధిలోనే తుదిశ్వాస విడవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

కుటుంబానికి అండగా ఉంటా : మంత్రి ఎర్రబెల్లి

ఒకే కుటుంబానికి చెందిన కూతురు, తండ్రి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. కుటుంబసభ్యులు నిమ్మల శ్రీనివాస్, మాధవి, సంతోష్‌లను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని చెప్పారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. మంత్రి వెంట మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, సీనియర్ నాయకులు శ్రీరామ్ సుధీర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్ కుమార్, ఎంపీటీసీ ఫోరం జిల్లా కన్వీనర్ బానోత్ రవీందర్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి, మండల యూత్ అధ్యక్షుడు కాసాని హరీష్, ఉపసర్పంచ్ రాము, సుంకరి అంజయ్య, యాకయ్య, నారాయణ, గాజుల ప్రసాద్ ఉన్నారు.





మొబైల్ పోయిందనే ఆందోళన వదిలేయండి

సీఈఐఆర్ ద్వారా ట్రాక్ చేయవచ్చు : జిల్లా ఎస్పీ

నవతెలంగాణ - ములుగు

పోగొట్టుకున్న, దొంగిలించబడ్డ మొబైల్ ఫోన్‌లను ట్రాక్ చేసే కొత్త విధానం సిఈఐఆర్ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ(సిఇఐఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను ట్రాక్ చేయడంలో సహాయపడుతుందని అన్నారు. ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకున్న మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్నచోరికి గురైతే పరిస్తితి ఎలాఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని అయితే కొత్తగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ సిఈఐఅర్ అప్లికేషన్ ద్వారా సెల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న లేదా చోరికి గురైనా వెతికి పట్టుకోవడానికి సిఇఐఆర్ పోర్టల్ దోహదపడుతుందని అన్నారు. www.ceir.gov.in వెబ్సైట్లో లాగిన్ అయి సంబంధిత వివరాలు నమోదు చేస్తే వచ్చే ఐడి ఆధారంగా మొబైల్ వివరాలు తెలుసుకోవచ్చున్నారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే ఐఎంఈఐ ఆధారంగా దర్యాప్తు చేస్తారన్నారు.



రాష్ట్రంలో రాబోయేది రామ రాజ్యమే

గబిజెపి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ - ములుగు

రాష్ట్రంలో రాబోయేది రామరాజ్యమేనని, బిజెపి నాయకత్వంలో కాషాయ జెండాను ఎగురవేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పాలంపేట గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర్ కష్ణవేణి నాయక్, మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం మాత్రం అవినీతిపరుల చేతుల్లో కి వెళ్లి అప్పుల రాష్ట్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు ,ప్రజలు బీఆర్ఎస్ అవినీతి,అక్రమాలు, పేపర్ లీకేజీలు, డ్రగ్స్ పాలన పట్ల ఆగ్రహంతో ఉన్నారని , దోచుకున్న సొమ్మును కక్కించి జైలుకు పంపే వరకు ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. నీళ్ల, నిధులు ,నియామకాల పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయలు దోచుకొంటూ ప్రజాధనాన్ని వధా చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కెసిఆర్ కుటుంబ అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి జిల్లా కార్యదర్శి రవీంద్ర చారి, సీనియర్ నాయకులు కారు పోతుల యాదగిరి గౌడ్, జినుకల కష్ణాకర్, తక్కల్లపల్లి సుమన్ రావు, గంగుల రాజ్,కుమార్ ,వినోద్ ,తిరుపతి , ప్రేమ్ సింగ్, రమేష్, శ్రీధర్, సోనాసింగ్ ,కారుపోతుల దేవేందర్, ధరమ్ సింగ్, సునీల్, శ్రీను, కపాన్వేష్ తదితరులున్నారు.

మండల కమిటీ ఎంపిక

భారతీయ జనతా పార్టీ వెంకటాపూర్ మండల పూర్తి కమిటీని జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్ సమక్షంలో ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా కాసర్ల రమేష్, కన్నెబోయిన వీరేందర్, గూడెపు సంతోష్, ఉపాధ్యక్షులుగా ఎలకంటి రాజు ,బోడ శ్రీనివాస్, కొత్త వీరస్వామి, ఎనబోతుల రమేష్, మంద రమేష్, కువ్వాల శ్రీనివాస్ కోశాధికారి గా పైడాకుల మల్లేష్ లను ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడు భూక్య జవహర్లాల్ నేతత్వంలో మండల కమిటీ ప్రతి పల్లెలో బూత్ కమిటీలను బలోపేతం చేసేందుకు, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ బిజెపి జెండాను ఎగురవేసేలా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు.



ముస్లింలకు రంజాన్ దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-గణపురం

రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు రంజాన్ పండుగ బట్టల స్థానిక సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్ ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్ సొసైటీ చైర్మన్ పో రెడ్డి పూర్ణ చంద్రారెడ్డి పంపిణీ చేశారు మండల కేంద్రంలోని ఫాతిమా -ఏ -మస్జీద్ మరియు జామ మస్జీద్ లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన కానుకను పంపిణి చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని మతాలు, కులాలను సమ దష్టితో ఆదరిస్తూ సంక్షేమానికి కషి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని మతాల పర్వదినాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తూ,రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నద న్నారు. ఈ కార్యక్రమంలోమండల అధికార ప్రతినిధి మోతె కరుణాకర్ రెడ్డి,ఉపసర్పంచ్ పోతర్ల అశోక్ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం తిరుపతి గౌడ్,వార్డు మెంబర్ హమీద్,ముస్లిం సోదరులు యాకుబ్, మంజూర్, లాలుమియా, రజాక్, పాష, కల్నాయక్,రియాజ్, హాఫీజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీఎన్జీవో ఉద్యోగులకు ఇఫ్తార్ విందు

నవతెలంగాణ- మహదేవపూర్



మేడిగడ్డ బ్యారేజీఎన్జీవో ఉద్యోగులకు బుధవారం రాత్రిమేడి గడ్డ బ్యారేజీ డివిజన్ వన్ఈ తిరుపతిలో ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఎన్జీవో ఉద్యోగస్తులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఎన్జీవో యూనిట్ అధ్యక్షులు ఎండి అనరుల్లా, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీఆర్ఎస్

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

తొమ్మిదేళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని కాసులపహాడ్, నర్సింగాపూర్, వేములపల్లి, బంగ్లాపల్లి, గుడిపహాడ్, ఎల్లారెడ్డిపల్లి, పిడిసిల్ల గ్రామాలల్లో కొనసాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో జీఎస్సార్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.యాత్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. యాత్ర మధ్యలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ళు గడుస్తున్నా, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు



వెలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను బంద్ చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందించని ఘనత బీఆర్ఎస్ దేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వ్యవసాయ భూములకు పారే నీరంత కూడా కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల ద్వారా వస్తున్నవే అని గుర్తుచేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల, రైతుల ఆకలి చావులు, ఆత్మహత్యలు సామాన్య ప్రజల నెత్తిపై అప్పులు తప్ప ఎలాంటి ప్రయోజనాలు కలగలేదన్నారు. ఈ నాయకులకు పర్సంటేజీల మీద ఉన్న ధ్యాస గ్రామాల అభివద్ధిపై లేదని విమర్శించారు.అవినీతిపై ప్రశ్నిస్తే మా నాయకులపై కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.అటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అదానీ ఆర్థికంగా ఎదగడానికి మాత్రమే మోదీ కషి చేస్తున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారం ప్రపంచ వేదికగా బట్టబయలైన విషయాన్ని దాచిపెట్టడానికి పార్లమెంటులో రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను రికార్డుల నుండి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ నయా నియంతగా మారి ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు.ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆకుతోట కుమారస్వామి, మండల మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ పోలినేని లింగారావు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి సుదర్శన్ గౌడ్, జిల్లా నాయకులు తక్కళ్ళపల్లి రాజు, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు వొనపాకల ప్రసాద్, చిలుకూరి దేవేందర్ రెడ్డి, పసరగొండ మహిపాల్, వొనపాకల లింగయ్య లతో పాటు ఆయా గ్రామాల అధ్యక్షులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెదురు బొంగులే కరెంట్ స్తంభాలుగా..

నడిరోడ్డుపై వేలాడుతున్నా కరెంట్ తీగలు

నవతెలంగాణ-పలిమెల

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని మోదేడు గ్రామానికి వెల్లె రహదారికి అడ్డంగా కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. దీనిని గమనించిన గ్రామ యువకులు ప్రమాదం కాకుండా ప్రయాణించే వారికి ప్రమాదం ఏర్పడకుండా ఉండేందుకు వెదురు బొంగులను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



తీగలను సరిచేయాలి

: మేకల లక్ష్మణ్ మోదేడు గ్రామం



వొరిగిన స్తంభాలు కిందికి వేలాడు తున్నా తీగలను వెంటనే సరి చేయాలి. మాది మోదేడు గ్రామం మా గ్రామానికి వచ్చే విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి రహదారిపై వేళాడు తున్నాయి విద్యుత్ అధికారు వెంటనే సరిచేయాలని కోరారు

కంటి వెలుగును డిఎం అండ్ హెచ్ఓ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామపంచాయతీ రాంనగర్ శివారు గ్రామమైన ఎల్బీనగర్లో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ములుగు జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ఈరోజు చివరి రోజు డాక్టర్ అప్పయ్య సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామంలో మొత్తం జనాభా 580 మంది కాగా అందులో ఇప్పటివరకు 470 మందిని కంటి వెలుగు పరీక్షలు చేయడం జరిగిందని సిబ్బంది తెలిపారు. వీరిలో 70 మందికి రీడింగ్ గ్లాసెస్



అందించినట్లు ఇంకా 501 మందికి దూరపు చూపు కోల్పోయినట్లుగా గుర్తించి వారికి కూడా త్వరలోనే ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అందజేస్తామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణ తీరును చూసి అప్పయ్య సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సుకుమార్ క్యాంప్ ఇన్చార్జి డాక్టర్ చంద్రకాంత్ సి హెచ్ ఓ సదానందం హెల్త్ అసిస్టెంట్ జంపయ్య కంటి వెలుగు సిబ్బంది ఆప్టిమెట్రిస్ట్ సురేష్ డి ఈ ఓ అమల ఏఎన్ఎం సరిత మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.రేపటినుండి గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపయ్యపల్లిలో నాలుగు రోజులపాటు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించబడుతుందని, గ్రామస్తులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య కోరారు.

రంజాన్ చాలా గొప్ప పండుగ

జిల్లా అదనపు కలెక్టర్ వైవి గణేష్

నవతెలంగాణ - ములుగు

రంజాన్ మాసం ఉపవాసాలు చాలా నిష్టతో పవిత్రంగా చేస్తారని రంజాన్ పండుగ నాకెంతో ఇష్టమైన చాలా గొప్ప పండుగని జిల్లా అదనపు కలెక్టర్ వైవి గణేష్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్ లో మైనార్టీ వెల్ఫేర్ శాఖ, రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వైవి గణేష్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్ తో కలిసి పాల్గొన్నారు.వారికి ముస్లిం మత గురువులు శాలువాతో సన్మానించారు. సాంప్రదాయాల ప్రకారం దువా, నమాజ్ చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో సందడి ఉంటుందన్నారు. ముస్లింల సంస్కృతి సాంప్రదాయాలు పాటించే విధంగా ఈ పండుగ గొప్పగా జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ గిఫ్ట్ ప్యాక్ల దుస్తులను పంపిణీ





చేశారు.జిల్లా గ్రంధాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ముస్లింలకు రంజాన్ పండుగకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా ములుగు జిల్లా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ చాలా గొప్ప పండుగని పండుగ రోజు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ తస్లీమా మహమ్మద్, తహసిల్దార్ ఎం. సత్యనారాయణ స్వామి, మైనార్టీ వెల్ఫేర్ శాఖ తరపున రేణుక, హిమమ్ రహీం, మౌలానా సలీం, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలైన తీన్మార్ మల్లన్న'తో ఆత్మీయ పలకరింపు

నవతెలంగాణ - ములుగు

హైదరాబాద్'లో క్యూ న్యూస్ అధినేత, ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్న ని వారి నివాసం'లో తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్ మర్యాద పూర్వకంగా బుధవారం కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కుట్రతో అక్రమంగా అరెస్టు చేసి జైల్లో 29 రోజులు నిర్బంధించి పైచాచిక ఆనందం పొందిందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ద్వారా న్యాయ వ్యవస్థ పై పూర్తి నమ్మకం ఉన్న మనం ఎప్పటికైనా న్యాయమే



గెలుస్తుందని తెలిపారు.అలాగే జిల్లాలో ని టీమ్ పై, జిల్లా సమస్యలపై అరా తీశారు.! ఎవరు భయపడవద్దని, ఇంకా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్ళాలని, రానున్న రోజుల్లో కల్వకుంట్ల కుటుంబ పాలనను అంతం చేసేంతవరకు విశ్రమించకుడా, రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను, అక్రమాలను, దౌర్జన్యాలు, అవినీతిని ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యల'పై పోరాటం చేయాలని, అమరుల ఆశయం సాధన దిశగా సామాజిక తెలంగాణనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యేంతవరకు వెనుకడుగు వేయకుండా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు, జనగాం జిల్లా అధ్యక్షుడు తుప్పతి శ్రీనివాస్, నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఆసుపత్రిని సందర్శించిన క్వాలిటీ అస్యూరెన్స్ బృందం

నవతెలంగాణ-చిట్యాల



మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండెట్ బందం బుధవారం సందర్శించారు. చత్తీస్గడ్ నుండి డాక్టర్ విక్రమ్ శర్మ తమిళనాడు నుండి డాక్టర్ షకీలా, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ భాను ప్రకాష్ తో కూడిన బందం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపి రిజిస్టర్ లను, ఐ పి, ఓ టి లేబర్ రూమ్, ఫార్మసీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని సేవల పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను పటిష్టం చేయాలని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ జీడీ తిరుపతి, అనస్తియా వైద్యుడు శ్రీకాంత్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లోపంతో డ్రైనేజీ నిర్మాణం

పట్టించుకోని

పంచాయతీరాజ్ అధికారులు

నవతెలంగాణ- కాటారం

కాటారం మండలం గుమ్మాలపల్లి గ్రామంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్న గుత్తేదారు ఆడింది ఆటగా పాడిందే పాటగా జరుగుతున్న పరిస్థితి నెలకొంది. పనులపై పర్యవేక్షణ చేయాల్సిన పంచాయ తీరాజ్ అధికారులు మామూళ్లకు తలొగ్గి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో నిర్మాణం చేపడుతున్న డ్రైనేజ్ పనులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యమైన సిమెంటు, ఇసుక, కంకర వాడకపోవడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో డ్రైనేజీ నిర్మాణం మూనాళ్ళ ముచ్చటగా మారే



ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నాణ్యతా లోపంతో పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించిన ఉన్నతాధికారులు పనులపై పర్యవేక్షణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమ సంబంధం బయటపడుతుందనే హత్య చేశారు

చిన్నాల చక్రధర్ దంపతులు

గర్భిణీని హత్య చేసి ఉరి వేసుకుందన్నారు

దోషులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలి

నవతెలంగాణ-మంగపేట

నా అల్లుడు కడారి మోహన్ తన అన్న బార్యతో జరుపుతున్న అక్రమ సంబందాన్ని కల్లారా చూసిందనే ఈ విషయం ఎక్కడ బయటపెడుతుందోననే భయంతో నా కూతురు కడారి జాన్సీరాణిని చంపి ఉరి వేసుకుని చనిపోయిందని తెలిపారని జాన్సీ తల్లి తండ్రులు చిన్నాల చక్రధర్, చందన (శివకుమారి) దంపతులు ఆరోపించారు. బుధవారం సాయంత్రం మండలంలోని మల్లూరు తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 2024 ఫిబ్రవరి 12న తన కూతురు జాన్సీరాణిని కోమటిపల్లికి చెందిన కడారి మోహన్ తో భారీ కట్న కానుకలు పెట్టి పోతలిచ్చి వివాహం జరిపించామన్నారు. ఈ క్రమంలో అంతకు ముందే తన అన్న నవీన్ భార్య మణితో అక్రమ సంబంధం నడుపుతున్న మోహన్ ఆ వ్యవహం తెలిసి సహకరిస్తున్న మోహన్ అక్క వడగం సంధ్య, బావ జగదాబి సాంబశివరావు తమను మోసం చేసి వివాహం జరిపించారని ఆరోపించారు. వివాహం జరిగిన రెండు నెలలుగా తన కూతురు జాన్సీని అల్లుడు మభ్య పెడుతూ వదినతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని ఈ విషయం పసిగట్టిన తన కూతురు తల్లితో చెప్పిందని పెళ్లై రెండు నెలలు కాక ముందే ఈ విషయం బయటపెట్టడం ఇష్టం లేని తల్లి విషయాన్ని దాచిపెట్టినట్లు ఆరోపించారు. కొత్తగా వివాహమైన సందర్భంగా అనవసరమైన విషయాలతో గొడవలు పెట్టుకోవద్దని అన్ని సర్దుకుంటాయని జాన్సీరాణికి నచ్చజెప్పిన తల్లి కాపురానికి పంపినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 17న వీరి అక్రమసంబందాన్ని కల్లారా చూసిన తన కూతురు జాన్సీరాణి విషయాన్ని బయట పెడుతుందోననే భయంతో అల్లాడు మోహన్ ఆయన వదిన మణిలు ఇద్దరు కలిసి నా కూతురును చంపి ఉరి వేశారని ఆరోపించారు. నా కూతురు ఉరి వేసుకుని చనిపోయేంత పిరికిది కాదని వీరి అక్రమ సంబంధాన్ని కల్లారా చూడడంతోనే హత్య చేశారని ఆరోపించారు. పోలీసులకు ఈ విషయమై పిర్యాదు చేశామని తమ కూతురు హత్యకు భాధ్యులైన అల్లుడు మోహన్ ఆయన వదిన మణి వీరికి సహాకరిస్తున్న బావ జగదాబి సాంబశివరావు, స్వప్న దంపతులు, అక్క వడగం సంధ్యలపై హత్య కేసే నమోదు చేసి జైలుకు పంపి తమ కూతురు జాన్సీరాణి ఆత్మకు శాంతి చేకూరేలా న్యాయం చేయాలని వేడుకున్నారు. సమావేశంలో సుదర్శన్ నాయుడు, ఆంజనేయులు, నరేష్ తదితరులున్నారు.



పలువురిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ -మహాముత్తారం

మహా ముత్తారం మండలంలోని ప్రేమ్ నగర్ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ముక్లోత్ మోతిలాల్- ఉషా బాయి కీ సర్జరీ కాగా బుధవారం మండల నాయకులు వారిని పరామర్శించారు. అనంతరం పెగడపల్లి గ్రామానికి చెందిన లావుడియా కిషన్ నాయక్ రోడ్డు ప్రమాదంలో హైదరాబాదు నిమ్స్ హాస్పటల్లో మరణించగా వారి కుటుంబానీకి పరామర్శించి పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి మందల రాజిరెడ్డి, ఎంపిటిసి శ్రీపతి సురేష్, పెగడపల్లి గ్రామ సర్పంచ్ కొర్ర వినోద జగపతి నాయక్, మహాముత్తారం యూత్ అధ్యక్షులు జాటోత్ జయపాల్ నాయక్, మాజీ సర్పంచ్ జాటోత్ శ్రీరాం నాయక్, పెగడపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు రామగిరి దుర్గయ్య , వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి అర్థిక సహాయం

నవతెలంగాణ -మహాముత్తారం

మహాముత్తారం మండలం లోని కనుకునూరు గ్రామానికి చెందిన చెన్నూరి దుర్గమ్మ మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కార్యదర్శి మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశానుసారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం ఆర్థిక సాయంాగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ ఆతుకూరి పోచయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మారబోయిన లక్ష్మణ్, డిఎస్‌బి యువజన నాయకులు, కార్యకర్తలు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చెన్నూరి ఎల్లన్న మాదిగ, పాల్గొన్నారు.



జీసీసీ ఆధ్వర్యంలో అవగాహనా సమావేశం

నవతెలంగాణ-మహాదేవపూర్

ఏటూరు నాగారం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఆదేశాల మేరకు డియం టి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జీసీసీ సేల్స్ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. డిఎం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ డిఆర్ డిపోల సమయపాలన పాటించాలని అన్నారు. మొబైల్ యాప్ ను ఉపయోగించడం అమ్మకాలు గత సంవత్సరం చేసిన కొనుగోలు అమ్మకాలు 2023 24 సంవత్సరం కోసం కార్యచరణ ప్రణాళిక, వ్యక్తిగత వారీగా కార్యచరణ, గత సంవత్సరం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, అటవీ ఉత్పత్తుల కొనుగోలు నూతన పెట్రోల్ బంకు ఏర్పాటుకు తదితర అంశాలపై చర్చించారు. డిఆర్ డిపోల అమ్మకాల సమీక్ష, నిత్యవసర వస్తువుల అమ్మకాలు వాటి లక్ష్యం, హాస్టళ్లకు సరఫరా, బకాయిల రికవరీ తదితర వాటిపై లక్ష్యాలు చేరకోవాలని అన్నారు. గత సంవత్సరం ఎంపి కొనుగోలు లో డిఆర్ఎస్ అమ్మకాలలో బ్రాంచ్ సిబ్బంది ముందంజలో ఉన్నారని అన్నారు. ప్రస్తుతం సంవత్సరం అన్ని విభాగంలో ఇంకా అభివద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హరిలాల్, ఇన్చార్జీలు సేల్స్ సిబ్బంది కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.